సంపుటి : 18
సంచిక : 223
Vol : 18
Issue : 223

RNI NO: TEL/TEL/2009/28544

తెలంగాణ & ఆంధ్రప్రదేశ్

పీపుల్స్‌డైరీ

సమగ్ర వార్తా దినపత్రిక

విలువలతో కూడిన నిఖార్సయిన జర్నలిజం

Editor : KONDAPARTHI KIRAN
CELL : 9493019044

వరంగల్, బుధవారం 4 నవంబర్ 2026
Warangal, Wednesday 4 November 2026

పేజీలు : 08
వెల రూ : 4-00

Pages : 08
Price : 4-00



www.epaper.peoplesdairynews.com
www.peoplesdairynews.com

Published From Warangal : Circulated in Hyderabad, Rangareddy, Warangal, Khammam, Nalgonda, Medak, Karimnagar, Nizamabad & TG All Districts



ఇతరుల ఆవేదనను గుర్తించాలి..

- నిరసన ప్రదేశాన్ని ఆక్రమించుకోవడం సరికాదు
- ఆందోళనల వల్ల వ్యాపారులకు, ప్రజలకు నష్టం
- ధర్నా చౌక్‌లలోనూ నిరసనలకు కాలపరిమితి ఉండాల్సిందే..

సుప్రీంకోర్టు సంచలన వ్యాఖ్యలు...

పీపుల్స్‌డైరీ-న్యూఢిల్లీ : న్యూఢిల్లీ: నిరసన పేరుతో ఓ ప్రదేశాన్ని ఎవరు కూడా నిరవధికంగా ఆక్రమించుకోలేరని సుప్రీంకోర్టు పేర్కొన్నది. ఆయా ప్రదేశాల్లో జరుగుతున్న ఆందోళనలకు నిర్దేశిత టైం పీరియడ్ ఉండాలని కోర్టు అభిప్రాయపడింది. సీఈసీకి వ్యతిరేకంగా గత నెలలో సెంట్రల్ ఢిల్లీలో విపక్షాలు భారీ ఎత్తు నిరసన ప్రదర్శన చేపట్టిన విషయం తెలిసిందే. ఆ ఆందోళన గురించి ఇవాళ సుప్రీంలో వాదనలు జరిగాయి. ప్రభుత్వ న్యాయవాది తుషార్ మెహతా స్పందిస్తూ.. నిరసన ప్రదర్శనకు ఎవరు పిలుపు ఇచ్చినా, దాని పర్యవసానాలను వాళ్లే ఎదుర్కోవాలని సుప్రీంకోర్టు తుషార్ మెహతా తెలిపారు. ఓ సైట్‌ను ఎప్పటికీ ఆక్రమించలేరని, నిరసన చేపట్టేందుకు ఇతరులు కూడా ఉన్నారని, రైతుల.. లాయర్లు ఎక్కడికి వెళ్తారని, ప్రతి ఒక్కరికీ నిరసన చేపట్టే హక్కు ఉందని సీజేఐ సూర్యకాంత్ అన్నారు. (మిగతా 2లో...)



రాజ్యసభలో తెలంగాణ ఎంపీల రికార్డు

- ఆస్తుల మోత.. కేసుల్లోనూ మోతెవర్లు..
- తెలుగు రాష్ట్రాల్లో కుబేర ఎంపీలు

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : ఇండియాలో అత్యంత శ్రీమంతులైన రాజ్యసభ ఎంపీల జాబితాలో తెలంగాణ రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిచింది. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్(ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ సంయుక్తంగా విడుదల చేసిన నివేదిక ప్రకారం.. దేశంలోని టాప్-3 అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీలలో ఇద్దరు తెలంగాణకు చెందినవారే కావడం గమనార్హం. దేశంలోనే అత్యంత ఎంపీలు వీరే..... బీఆర్ఎస్ ఎంపీ బండి పార్థసారధి రెడ్డి రూ.5,300 కోట్ల ఆస్తులతో దేశంలోనే అత్యంత ధనిక రాజ్యసభ ఎంపీగా మొదటిస్థానంలో నిలిచారు. పంజాబ్‌కు చెందిన బీజేపీ ఎంపీ రాజీందర్ గుప్తా(రూ.5,053 కోట్లు) రెండో స్థానంలో ఉండగా.. తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వి రూ.2,558 కోట్ల ఆస్తులతో మూడో స్థానంలో ఉన్నారు. ఈ ఇద్దరు ఎంపీల ఆస్తులే తెలంగాణ రాజ్యసభ సభ్యుల మొత్తం ఆస్తుల్లో దాదాపు 95 శాతంగా ఉండటం విశేషం. తెలంగాణలోని ఏడుగురు రాజ్యసభ ఎంపీల మొత్తం ఆస్తుల (మిగతా 2లో...)



సముద్రంలో భారత శౌర్యం

- సముద్ర దొంగలకు ఊహించని షాక్
- మూడు వేల కిలోమీటర్ల వేట
- సాగరంలో 48 గంటల ఆపరేషన్..
- చివరకు హైజాక్‌కు గురైన నౌక స్వాధీనం

పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : భారత నావికాదళం సముద్ర భద్రతలో కీలక పాత్ర పోషిస్తుంది. సోమాలియా ఈశాన్య తీరం దగ్గర సాయుధ సముద్రపు దొంగలు హైజాక్ చేసిన ఇరానియన్ ఫిషింగ్ నౌక అజినిని భారత నావికాదళం విజయవంతంగా రక్షించింది. 48 గంటలకు పైగా సాగిన ఆపరేషన్‌లో 20 మంది సిబ్బందిని ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు లేకుండా సురక్షితంగా విడిపించారు. అక్టోబర్ 29న సోమాలియా ఈశాన్య తీరంలో బందర్ బైలా-హఫున్ ప్రాంతం మధ్య సాయుధ దొంగల (మిగతా 2లో...)



కరువులోనూ కాసుల పంట!

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో రైతులు పంటల సాగు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ.. ఆయిల్‌పామ్ సాగు మాత్రం రైతులకు ఆశాజనకంగా మారుతోంది. తెలంగాణ రాష్ట్ర నూనెగింజల ఉత్పత్తిదారుల సమాఖ్య (ఆయిల్‌ఫెడ్) ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు, శుద్ధిలో సరికొత్త రికార్డులను నమోదు చేసింది. 2025-26 సంవత్సరంలో ఏకంగా 4.74 లక్షల టన్నుల ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేసి, రైతులకు సుమారు రూ.1,100 కోట్లను చెల్లించింది. రైతులకు టన్నుకు సగటున రూ.23,100 ధర లభించడం ఈ రంగంలో సానుకూల (మిగతా 2లో...)

- రైతన్ననను ఆదుకుంటున్న ఆయిల్‌పామ్
- ఆపద సమయంలో భరోసా కల్పించింది...
- 74 లక్షల టన్నుల గెలల సేకరణ

ప్రాణనష్టం లేని పోరాటం

2లో

- సీఆర్‌పీఎఫ్ అరుదైన విజయం
- 47 ఏళ్ల తర్వాత ఆపరేషన్లలో అద్భుత రికార్డు
- జవాన్ల భద్రతకు భరోసా
- వీరుల విజయగాథ ఆవిష్కృతం
- ఏడాది పాటు జీరో మరణాలు

నదులకు కాలుష్యం కాటు..

జల జీవనానికి కాలుష్య గండం

- నదీజలాల్లో విషపు ఆనవాళ్లు
- ఈ నదుల నీళ్లు తాగుతున్నారా?
- పరిమితి కంటే ఎక్కువ కాలుష్యం
- పీసీబీ నివేదికలో విస్తుపోయే నిజాలు!

పీపుల్స్‌డైరీ-హైదరాబాద్ : తెలంగాణలో నదుల కాలుష్యంపై రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) విడుదల చేసిన రిపోర్టు ఆందోళన రేకెత్తిస్తోంది. తెలంగాణలో నాలుగు నదీ పరివాహక ప్రాంతాలను కాలుష్య రహిత జాబితాలోకి మార్చినప్పటికీ.. మంజీర, మూసి, కృష్ణ, గోదావరి నదుల్లో కాలుష్య శాతాలు పరిమితి కంటే చాలా ఎక్కువగా ఉన్నాయని కాలుష్య నియంత్రణ మండలి స్పష్టం చేసింది. ముఖ్యంగా వీటిలో హైదరాబాద్ మహానగరంలో చాలా వరకు దాహం తీర్చే మంజీర నది అత్యంత తీవ్రంగా కాలుష్యానికి గురైనట్లు ఆ నివేదిక స్పష్టం చేస్తోంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి(సీపీసీబీ) 2022లో తెలంగాణలో 9 నదీ పరివాహక ప్రాంతాలను కాలుష్య కాసారాలుగా గుర్తించింది. అయితే తాజాగా సవరించిన రిపోర్టు ప్రకారం నక్కవాగు, కరకవాగు, కిన్నెరసాని, మున్నేరు నదులకు చెందిన 4 పరివాహక ప్రాంతాలను ఈ కాలుష్య జాబితా నుంచి తొలగించడం గమనార్హం. మిగిలిన 5 ప్రాంతాల్లో మానేరు నదిలో నీరు అందుబాటులో లేకపోవడం వల్ల అక్కడ నమూనాలను సేకరించలేకపోయినట్లు పీసీబీ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో పేర్కొంది. నదీ జలాల నాణ్యతను అంచనా వేసేందుకు బయోకెమికల్ ఆక్సిజన్ డిమాండ్(బీవోడీ)ను కీలక ప్రమాణంగా (మిగతా 2లో...)

4లో

✍ పీపుల్స్ డైరీ-చిట్యాల

రూ. 49 కోట్లు మానేరు పాలు

- కలగానే మానేరు వాగుపై వంతెన నిర్మాణం
- పదేండ్లు దాటిన అసంపూర్తిగా వంతెన నిర్మాణం
- బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు..?

ప్రాణనష్టం లేని పోరాటం

- సీఆర్‌పీఎఫ్ అరుదైన విజయం
- 47 ఏళ్ల తర్వాత ఆపరేషన్లలో అద్భుత రికార్డు
- జవాన్ల భద్రతకు భరోసా
- వీరుల విజయగాథ ఆవిష్కృతం
- ఏడాది పాటు ఆపరేషన్లలో జీరో మరణాలు



పీపుల్స్‌డైరీ-వెబ్‌డెస్క్ : దేశ భద్రతలో కీలక పాత్ర పోషిస్తున్న 'సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్' (సీఆర్‌పీఎఫ్) అత్యంత అరుదైన, విశిష్టమైన మైలురాయిని చేరుకుంది. గత 12 నెలలుగా (ఒక సంవత్సరం) సీఆర్‌పీఎఫ్ బలగాలు చేపట్టిన ఏ ఒక్క ఆపరేషన్‌లోనూ ఒక్క జవాను కూడా ప్రాణాలు కోల్పోకపోవడం విశేషం. సీఆర్‌పీఎఫ్ చరిత్రలోనే ఇదొక చారిత్రాత్మక ఘట్టం. మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, జమ్మూ కాశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల వంటి అత్యంత సమస్యాత్మక, తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలలో సీఆర్‌పీఎఫ్ నిరంతరం విధులు నిర్వహిస్తోంది. అక్కడ నిరంతర ఎదురుకాల్పులు, ఉగ్రవాద వ్యతిరేక చర్యలు ముమ్మరంగా సాగుతున్నప్పటికీ, బలగాలు తమ వ్యూహాత్మక ప్రతిభతో ఈ అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాయి.

47 ఏండ్ల తర్వాత...

ఆఖరిగా 2025 అక్టోబర్ 30న ఒక ఆపరేషన్‌లో సీఆర్‌పీఎఫ్ జవాను అమరుడయ్యారు. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు వరుసగా 12 నెలల పాటు ఆపరేషనల్ రంగాలు ఎక్కడైనా సరే, ఒక్క జవాను ప్రాణనష్టం కూడా సంభవించలేదు. ఇలా ఏడాది పొడవునా ఎటువంటి ప్రాణనష్టం లేకుండా సురక్షితంగా ఆపరేషన్లు పూర్తి చేయడం 47 సంవత్సరాల తర్వాత (చివరిసారిగా జనవరి 1979లో) మళ్లీ ఇప్పుడు చోటు చేసుకోవడం విశేషం.

ఘనతకు కారణాలివే...

ఆధునిక సాంకేతికత, ఆయుధ సంపత్తి: జవాన్లకు అత్యాధునిక ఆయుధాలు, తాజా రక్షణ పరికరాలు అందించడం. ఉన్నత స్థాయి శిక్షణ: తీవ్రవాద, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో పోరాడేందుకు ఆర్మీ స్థాయి ఆధునిక శిక్షణ ఇవ్వడం. సమర్థవంతమైన వ్యూహాలు: నిఘా వర్గాల సమాచారాన్ని సమర్థవంతంగా వాడుకుంటూ కచ్చితమైన వ్యూహాత్మక ప్రణాళికలతో ముందడుగు వేయడం. వేగవంతమైన వైద్య సేవలు: ఆపరేషన్లలో గాయపడిన జవాన్లకు సకాలంలో ప్రాథమిక చికిత్స అందించడంతో పాటు, అత్యంత వేగంగా సెకందరీ, టెర్షరీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించేలా ప్రత్యేక నెట్‌వర్క్ ఏర్పాటు చేయడం

సముద్రంలో భారత్ శౌర్యం

(మొదటి పేజీ తరువాయి)

ముఠా సుమారు 12 మంది అజిని నౌకను స్వాధీనం చేసుకుంది. ఈ నౌకను వాణిజ్య నౌకలపై మరిన్ని దాడులకు మదర్ షిప్ గా ఉపయోగించే అవకాశం ఉందని మారిటైమ్ భద్రతా సంస్థలు హెచ్చరించాయి. నౌక తూర్పు వైపు వాణిజ్య మార్గాల దిశగా కదులుతుండటంతో భారత నావికాదళం వెంటనే చర్యలు చేపట్టింది. భారత నావికాదళం యుద్ధనౌక ఐఎన్ఎస్ కోల్‌కత్తా సహా సముద్ర నిఘా విమానం సహాయంతో నౌకను గుర్తించి దాని కదలికలను నిరంతరం పర్యవేక్షించింది. నౌక తప్పించుకోకుండా క్యాలిబ్రేటెడ్ నాన్-కైనెటిక్ చర్యలతో అడ్డుకుంది.

భారత వైమానిక దళం సి-17 విమానం ద్వారా మెరైన్ కమాండోలు (మార్కోస్)ను పారాడ్రాప్ చేసి త్వరితగతిన ఆపరేషన్ పూర్తి చేశారు. నవంబర్ 2న ఈ ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. దొంగల నుంచి భారీ సంఖ్యలో ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆపరేషన్ ముంబై నుంచి 3,000 కి.మీ.కు పైగా దూరంలో జరిగింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఈ విజయాన్ని అభినందిస్తూ, మూడు వేల కిలోమీటర్ల దూరంలో 48 గంటల సమన్వయ ఆపరేషన్‌లో అజిని నౌకలోని 20 మంది సిబ్బందిని సాయుధ దొంగల నుంచి సురక్షితంగా రక్షించిన భారత నావికాదళానికి అభినందనలు తెలిపారు.

భారత వైమానిక దళం సకాలంలో అందించిన సహకారంతో జరిగిన ఈ చర్య నావికాదళం యొక్క అధిక ఆపరేషనల్ రెడీనెస్‌ను చూపిస్తుందని పేర్కొన్నారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో సముద్రయాన సిబ్బంది భద్రత, కీలక వాణిజ్య మార్గాల రక్షణ, సురక్షితమైన సముద్ర వాతావరణం నిర్ధారణకు భారత నావికాదళం కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు. ఈ ఆపరేషన్ భారత నౌకాదళ సామర్థ్యానికి నిదర్శనంగా నిలిచింది.

రాజ్యసభలో తెలంగాణ ఎంపీల రికార్డు..

(మొదటి పేజీ తరువాయి)

విలువ రూ.8,310 కోట్లుగా నమోదై, దేశంలోనే అత్యధిక ఆస్తులు కలిగిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది.

దేశవ్యాప్తంగా ఉన్న 32 మంది బిలియనీర్ ఎంపీలలో 28 శాతం మంది(9 మంది) తెలుగు రాష్ట్రాలకు చెందినవారే కావడం గమనార్హం.

నేర చరిత్రలోనూ తగ్గేదేలే....

రాజ్యసభ ఎంపీల నేర చరిత్ర డిక్లరేషన్‌లో కూడా తెలంగాణ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. తెలంగాణకు చెందిన మొత్తం ఏడుగురు రాజ్యసభ సభ్యులలో 71 శాతం మంది (5 గురు ఎంపీలు) తమపై నేర కేసులు ఉన్నట్లు స్వచ్ఛందంగా వెల్లడించారు. అంతేకాకుండా తీవ్ర నేరారోపణ కేటగిరీలో కూడా తెలంగాణ ఎంపీలు 42 శాతం(3/7)తో అగ్రస్థానంలో ఉన్నారు. తెలంగాణలోని ఎంపీల వారీగా చూస్తే.. కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మందడిపై అత్యధికంగా 17 కేసులు నమోదయ్యాయి. వీటిలో 3 తీవ్రమైన ఐపీసీ కేసులు కూడా ఉన్నాయి. బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్రపై 6 కేసులు ఉండగా.. అందులో 4 తీవ్రమైన కేటగిరీకి చెందినవి. అలాగే కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరిపై 5 కేసులు ఉండగా.. అందులో ఒకటి తీవ్రమైన కేసుగా నమోదైంది. మరోవైపు ఏపీలో 45 శాతం మంది (11 మంది ఎంపీలలో 5గురు) తమపై నేర కేసులు ఉన్నట్లు తెలిపారు. జనసేన ఎంపీ లింగమనేని రమేష్‌పై 9 కేసులు ఉన్నప్పటికీ.. వాటిలో తీవ్రమైన కేసులు ఏవీ లేవు. అయితే టీడీపీ ఎంపీ విజయ్ చింతకాయల మాత్రం తీవ్రమైన కేసు ఎదుర్కొంటున్న ఏకైక ఏపీ ఎంపీగా నిలిచారు.

నదులకు కాలుష్యం కాటు...

(మొదటి పేజీ తరువాయి)

పరిగణిస్తారు. సాధారణంగా నదీ నీరు సురక్షితంగా ఉండాలంటే బీవోడీ స్థాయి లీటరుకు 3 మిల్లీగ్రాముల కంటే తక్కువగా ఉండాలి. కానీ మంజీర నదిలో సింగూరు నుంచి పాపన్నపేట మధ్య బీవోడీ స్థాయి ఏకంగా లీటరుకు 12 మిల్లీగ్రాములుగా నమోదైంది. ఇది సాధారణ పరిమితి కంటే దాదాపు మూడు రెట్లు ఎక్కువ కావడం గమనార్హం.

మరోవైపు హైదరాబాద్ జీవనాడి అయిన మూసి నది కూడా తీవ్ర కాలుష్యంతో కొట్టుమిట్టాడుతోంది. బాపూ ఘాట్ నుంచి నది కృష్ణాలో కలిసే వాడపల్లి వరకు ఉన్న పరివాహక ప్రాంతంలో మూసి నది బీవోడీ స్థాయి లీటరుకు 9 మిల్లీగ్రాములుగా నమోదైంది. ఇది పరిమితి కంటే రెండు రెట్లు ఎక్కువ. ఇక జీవనదులైన కృష్ణ, గోదావరి నదులలో కూడా బీవోడీ స్థాయిలు పరిమితిని దాటాయి. గద్వాల బ్రిడ్జి నుంచి వాడపల్లి మధ్య కృష్ణా నదిలో 3.6 మిల్లీగ్రాములు, పొచ్చెర జలపాతం నుంచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మధ్య గోదావరి నదిలో 3.6 మిల్లీగ్రాముల చొప్పున బీవోడీ నమోదైంది.

రాష్ట్రవ్యాప్తంగా నదులు, చెరువులు, బోరు బావులు, మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీలు), కాలువల పరిధిలోని 57 ప్రాంతాల నుంచి పీసీబీ క్రమం తప్పకుండా 580 నీటి నమూనాలను సేకరించి ఈ విశ్లేషణ నిర్వహించినట్లు నివేదిక స్పష్టం చేసింది.



కరువులోనూ కాసుల పంట..

(మొదటి పేజీ తరువాయి)

పరిణామంగా నిలిచింది. అక్టోబరుతో ముగిసిన ప్రగతి నివేదికను ఆయిల్‌ఫెడ్ ఆదివారం విడుదల చేసింది. కరవు పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొనుగోళ్లు గణనీయంగా పెరగడం ఆయిల్‌పామ్ సాగుకు ఉన్న ప్రాధాన్యాన్ని చాటుతోంది.

ఆయిల్‌ఫెడ్ గణాంకాల ప్రకారం.. 2024-25 సంవత్సరంలో 3,27,803 టన్నుల ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేయగా.. 2025-26లో ఈ పరిమాణం 4,73,997 టన్నులకు చేరింది. గత ఏడాదితో పోలిస్తే కొనుగోళ్లు 44.60 శాతం పెరిగాయి. సేకరించిన గెలలను రాష్ట్రంలోని ఆయిల్‌పామ్ కర్మాగారాల్లో శుద్ధి చేసి ముడి పామాయిల్ ఉత్పత్తి చేస్తున్నారు. రైతుల నుంచి గెలల సేకరణ పెరగడంతో పాటు కర్మాగారాల్లో శుద్ధి కార్యకలాపాలు కూడా విస్తరించడం ఈ రంగంలో సంస్థ సాధించిన పురోగతికి నిదర్శనంగా నిలుస్తోంది.



రాష్ట్రంలో కరవు పరిస్థితులు ఉన్నప్పటికీ అశ్వారావుపేట, అప్పారావుపేట, నర్మెట ఆయిల్‌పామ్ కర్మాగారాల్లో ఏడాది పొడవునా కొనుగోళ్లు, శుద్ధి ప్రక్రియ కొనసాగాయి. రైతుల నుంచి సేకరించిన గెలలను సకాలంలో కర్మాగారాలకు తరలించి ప్రాసెసింగ్ చేయడం ద్వారా ఉత్పత్తి కార్యకలాపాలను నిరంతరాయంగా నిర్వహించారు. ఆయిల్‌పామ్ సాగులో వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యత కీలకమైనప్పటికీ.. ఈ పంట నుంచి నిరంతర ఆదాయం పొందే అవకాశాలు ఉండటంతో రైతుల్లో ఆసక్తి పెరుగుతోంది.

మరోవైపు, వంట నూనెల ఉత్పత్తి, ప్యాకింగ్, పంపిణీని విస్తరించడంపై ఆయిల్‌ఫెడ్ దృష్టి సారించింది. రాష్ట్రంలో ముడి పామాయిల్‌ను రికార్డు స్థాయిలో శుద్ధి చేసి మార్కెట్‌కు సరఫరా చేసేందుకు సన్నాహాలు చేపట్టింది. ఇందులో భాగంగా విజయ బ్రాండ్ ఎడిబుల్ ఆయిల్స్ ఉత్పత్తి, ప్యాకింగ్, పంపిణీ సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించింది. ఇందుకోసం పూర్తి స్థాయి ఆటోమేటెడ్ మెగా ఆయిల్ ప్యాకింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రం ద్వారా నాణ్యమైన వంట నూనెలను పోటీ ధరలకు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఆయిల్‌పామ్ గెలల కొనుగోళ్లలో పెరుగుదల, శుద్ధి సామర్థ్య విస్తరణ, విజయ బ్రాండ్ వంట నూనెల పంపిణీకి చేపడుతున్న చర్యలు రాష్ట్రంలో ఆయిల్‌పామ్ రంగానికి కొత్త అవకాశాలను కల్పించనున్నాయి. రైతులకు గిట్టుబాటు ధరలు అందించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన వంట నూనెలను సరసమైన ధరలకు అందించడం ద్వారా ఉత్పత్తి నుంచి మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను బలోపేతం చేయాలని ఆయిల్‌ఫెడ్ భావిస్తోంది.

ఇతరుల ఆవేదనను గుర్తించాలి...

(మొదటి పేజీ తరువాయి)

ఈ విచారణలో కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ.. నిరసనలకు పిలుపునిచ్చే వారే ఆ నిరసనల వల్ల కలిగే ఎలాంటి పర్యవసానాలకైనా పూర్తి బాధ్యత వహించాలని కోర్టుకు తెలిపారు. "ఎవరూ నిరంతరం ఒకే ప్రాంతాన్ని ఆక్రమించుకోలేరు.. అక్కడ ఇతర నిరసనకారులు కూడా ఉంటారు. అలాంటప్పుడు రైతులు గానీ, న్యాయవాదులు గానీ తమ నిరసనలు ఎక్కడ తెలుపుకోవాలి? నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుంది" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ వ్యాఖ్యానించారు. పండుగల సీజన్‌లో నిరసనలను నిలిపివేయాలని కోరుతూ ఢిల్లీ వర్తక సంఘాలు దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని కేంద్రం సహా ఇతరులకు సీజేఐ నోటీసులు జారీ చేశారు.

జులై 20న జరిగిన నిరసనలకు కేవలం ఒక్క రోజు మాత్రమే అనుమతి ఇచ్చామని, అయితే నిరసనకారులు ఆ స్థలాన్ని ఆక్రమించడమే కాకుండా పార్లమెంట్ వైపు కూడా మార్చ్ నిర్వహించారని తుషార్ మెహతా కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. "పార్లమెంట్ అనేది కేవలం మరొక సాధారణ రాజకీయ భవనం కాదు. మీరు పార్లమెంట్‌కే నేరుగా మార్చ్ నిర్వహించలేరు. అలాగే సుప్రీంకోర్టు వైపు కూడా మార్చ్ చేయడానికి వీల్లేదు" అని ఆయన అన్నారు.

ఘనంగా ప్రారంభమైన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్

క్లస్టర్-డి పోటీలు... టీఎస్ఎస్పీ జోన్-1 శుభారంభం



పీపుల్స్‌డైరీ-వరంగల్ : వరంగల్ కమిషనరేట్ వేదికగా 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్, క్లస్టర్-డి విభాగానికి సంబంధించిన క్రీడా పోటీలు అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వాన్ని, మానసిక ఉల్లాసాన్ని మరియు క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రతి ఏటా నిర్వహించే ఈ క్రీడల ప్రారంభోత్సవానికి విశిష్ట అతిథిగా 4వ బెటాలియన్ కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు విచ్చేశారు. కమాండెంట్ ఎన్.వి.ఎస్. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. జోన్ 1 క్రీడాకారులకు జెర్సీలు, క్యాప్స్ అందించామని, విధి నిర్వహణలో నిరంతరం ఒత్తిడికి లోనయ్యే పోలీసులకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో రాణించాలని, గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను పెంచాలని పిలుపునిచ్చారు. పోటీల మొదటి రోజున తెలంగాణ ప్రత్యేక పోలీస్ జోన్-1 క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. కబడ్డీ, హాకీ, వాలీబాల్, కోకో బాస్కెట్ బాల్ వివిధ క్రీడాంశాలలో జోన్-1 జట్లు తమ ప్రతిభను చాటుతూ విజయాలతో టోర్నమెంట్‌ను ఘనంగా ప్రారంభించాయి .

ఈ కార్యక్రమంలో వరంగల్ కమిషనరేట్ పరిధిలోని ఉన్నతాధికారులు, బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ వంశీ మోహన్ రెడ్డి,అసిస్టెంట్ కమాండెంట్స్ వీరన్న, నాగభూషణం, ఆర్ఐ కార్తీక్ అధికారులు, కోచ్‌లు మరియు పెద్ద సంఖ్యలో పోలీస్ క్రీడాకారులు పాల్గొన్నారు.


సమస్యల పరిష్కారానికి కృషి



పీపుల్స్‌డైరీ-సంగెం : సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పిఆర్టియు వరంగల్ జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం సంగెం మండలం జడ్పీహెచ్ఎస్ కాపుల కనపర్తి పాఠశాలలో హెచ్ఎం శోభారాణి మరియు ఉపాధ్యాయ బృందం నూతనంగా పి ఆర్ టి యు జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల, పాఠశాల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శోభారాణి , ఉపాధ్యాయులు రాజన్న, వినోద, గోపి ,ఎం రవీందర్, రతన్ సింగ్ రాథోడ్, పూర్ణచందర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆపన్న హస్తం

- రూ.1,16,250 ఆర్థిక సాయం
- మానవత్వం చాటిన పూర్వ విద్యార్థులు



పీపుల్స్‌డైరీ-వరంగల్ : ఆపదలో ఉన్న స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచి మానవత్వాన్ని చాటుకున్నారు మహబూబియా హైస్కూల్‌కు చెందిన 1993-94 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు. వరంగల్‌లోని సింరంగిరాజరామ్ తోట ప్రాంతానికి చెందిన దాసరి అశోక్ ఇటీవల గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో పడింది.

అశోక్‌కు ఇద్దరు పిల్లలు కాగా, కుమార్తె డిగ్రీ తృతీయ సంవత్సరం, కుమారుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నారు. భార్యాభర్తలిద్దరూ కిరాణా దుకాణంలో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. సొంత ఇల్లు లేక కిరాయి ఇంట్లో నివసిస్తున్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న అశోక్ పదో తరగతి స్నేహితులు చలించిపోయారు. తమ వంతుగా ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించుకున్నారు.

1993-94 బ్యాచ్‌కు చెందిన స్నేహితులంతా ఒక్కొక్కరు తమ వంతు సహకారం అందించగా, విదేశాల్లో ఉంటున్న అశోక్ మిత్రులు సైతం విరాళాలు పంపించారు. ఇలా సమకూరిన మొత్తం రూ.1,16,250ను మంగళవారం అశోక్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ మొత్తాన్ని పిల్లల ఉన్నత చదువుల కోసం వినియోగించాలని స్నేహితులు సూచించారు. కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచి ఆర్థిక సహాయం అందించిన స్నేహితులందరికీ అశోక్ కుటుంబ సభ్యులు బాధాతప్త హృదయంతో కృతజ్ఞతలు తెలియజేశారు. స్నేహబంధం కేవలం కలుసుకోవడానికే పరిమితం కాదని, ఆపదలో ఉన్నప్పుడు అండగా నిలవడమే నిజమైన స్నేహమని ఈ కార్యక్రమం చాటిచెప్పింది.

ఈ కార్యక్రమంలో అంకాల ధర్మరాజు, కృష్ణరాజు, మంద ప్రతాప్, కనుకుంట్ల నాగరాజు, బన్న ప్రభాకర్, కుసుమ వినోద్, గడ్డం ప్రసాద్, జారతి రమేష్, కన్నె ప్రవీణ్, పెంచల సురేందర్, జారతి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసా తెలంగాణ రాష్ట్ర మహిళ కన్వీనర్‌గా బుర్ర స్వాతి

వేమనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన బుర్ర స్వాతి

పీపుల్స్‌డైరీ, హైదరాబాద్ : ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్‌గా తనను ఎన్నుకున్నందుకు ఐసా జాతీయ కమిటీ సభ్యులు వేమనకు బుర్ర స్వాతి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఉస్మానియా యూ నివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్ర వర్క్‌షాప్‌లో 21 మందితో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా తనకు రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషంగా ఉం దని బుర్ర స్వాతి పేర్కొన్నారు. అలాగే తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నాయక్వాన్కి, విద్యార్థి సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో విద్యార్థినులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, మహిళా విద్యార్థుల హక్కుల సాధన కోసం, ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం ఐసా ఆధ్వర్యంలో నిరంతరం పోరాటాలు నిర్వహిస్తానని బుర్ర స్వాతి తెలిపారు.



పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 04 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 225

ఇంకుడు గుంతలు నిర్మిద్దాం వర్షపు నీటిని సంరక్షిద్దాం

- ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఒక రక్షణ కవచం...
- గుగులోత్ భద్రు నాయక్ సర్పంచ్ చిన్నకిష్టపురం గ్రామపంచాయతీ...



మహబూబాబాద్-నవంబర్ 03(పీపుల్స్ డైరీ) : చిన్న కిష్టాపురం గ్రామపంచాయతీలోని ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలను తప్పనిసరిగా నిర్మించుకుని వాన నీటిని సంరక్షించుకోవాలని ఇంకుడు గుంత ప్రతి ఇంటికి రక్షణ కవచంగా మారుతుందని చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ భద్రు నాయక్ తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ పరిధిలోని మంగలితండ గ్రామంలో ఇంకుడు గుంతలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, వర్షపు నీటి సంరక్షణకు ఇంకుడు గుంతలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.రానున్న రోజుల్లో ఎల్ నినో ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని తెలిపారు. వాన నీటిని ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించడంతోనే జల సమృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంత నిర్మించుకోవడం వల్ల వర్షపు నీరు వృధా కాకుండా భూగర్భంలోకి ఇంకి నీటి ఎద్దడి నుండి రక్షణ లభిస్తుందన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు,బాబు, అంజయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శులు పంచాయతీ పరిధిలోనే నివాసం ఉండాలి

- గార్లలో చుట్టపు చూపు పాలనకు స్వస్తి పలకాలి...
- ప్రజలకు అందుబాటులో ఉండాలి...



మహబూబాబాద్-నవంబర్ 03(పీపుల్స్ డైరీ) : తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం 2018 సెక్షన్ 43 ప్రకారం గ్రామపంచాయతీ సమర్థవంతంగా పనిచేయడానికి పంచాయతీ కార్యదర్శులు తప్పనిసరిగా స్థానికంగా నివాసం ఉండాలి.కానీ అలా కాకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పట్టణ ప్రాంతాల నుండి రాకపోకలు సాగిస్తూ చుట్టపు చూపు పాలన కొనసాగిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.గ్రామాల్లో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలు అందించాల్సిన కార్యదర్శులు తాము పని చేసే చోట నివాసము ఉండకుండా పట్టణాల నుండి రాకపోకలు సాగిస్తున్న వారి ఏజెన్సీ అలవెన్సులు నిలుపుదల చేయాలని,ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఇప్పటివరకు తీసుకున్న అలవెన్స్ లను రికవరీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్థానికంగా అందుబాటులో ఉండాల్సిన పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో నివాసం ఉండకుండా నిబంధనలను ఉల్లంఘిస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం గ్రామపంచాయతీ కార్యదర్శులు తాము బాధ్యతలు నిర్వర్తించే గ్రామంలోనే నివాసం ఉంటూ ప్రజలకు అత్యవసర వీధులకు అందుబా టులో ఉండాలి కానీ క్షేత్రస్థాయిలో నివసించకపోవడమే కాకుండా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులర్ గా అలవెన్సులు పొందుతున్నప్పటికి చర్యలు తీసుకోవడం లో అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.కార్యదర్శులు తమ సొంత ఊళ్ళ నుండి ప్రతిరోజు రాకపోకలు సాగించడం వల్ల ఉదయం వేళలో ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. చూసి చూడనట్లు వ్యవహరించకుండా ఇప్పటికైనా సంబంధిత శాఖల జిల్లా,మండల అధికారులు గ్రామపంచాయతీ కార్యాలయాలకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సమయపాలన పాటించని, పనిచేసే చోట నివాసం ఉండని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గార్ల కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో అందని వైద్య సేవలు

- మందుల కొరత- రక్త పరీక్షలు నిలిపివేత
- పూర్తిస్థాయిలో లేని పరీక్షల పరికరాలు
- కొన్ని పరీక్షలు మాత్రమే అందుబాటులో
- పూర్తిస్థాయిలో వైద్యులు సిబ్బందిని నియమించాలి
- వైద్యుల కొరత తీర్చాలి
- సిపిఎం డిమాండ్



మహబూబాబాద్-నవంబర్ 03(పీపుల్స్ డైరీ) : గార్ల కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో ఎదురవుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం మహబూబాబాద్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం గార్ల మండల కేంద్రంలోని స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం ఎదుట సిపిఎం,ఐద్వా ఆధ్వర్యంలో జోరు వానలో ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బందిని నియమించి రోగులకు సరిపడా మందులను సరఫరా చేయాలని కోరారు. ఆసుపత్రిలో తగిన సంఖ్యలో వైద్యులు, సిబ్బంది లేకపోవడం వల్ల రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు.సీజనల్ వ్యాధులు ప్రభలుతున్న సమయంలోనూ కనీస అవసరమైన ఉచిత మందుల నిల్వ అందుబాటులో లేకపోవడం వల్ల పేదలు ప్రైవేట్ మెడికల్ షాపులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆసుపత్రిలో అన్ని రకాల అత్యవసర మందులు ఇంజక్షన్లు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పరీక్షల పరికరాలు సక్రమంగా పని చేయకపోవడం మూలంగా కొన్ని పరీక్షలు మాత్రమే అందుబాటులో ఉన్నట్లు ప్రకటించడం బాధాకరమని అన్నారు. కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్యం లేకపోవడమే కాకుండా దీనికి తోడు మందుల కొరత, రక్త పరీక్షలు నిలిపివేతతో రోగులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొ న్నారని ఆయన అన్నారు. ఆసుపత్రిలో యధావిధిగా అన్ని రక్త పరీక్షలు చేయాల ని, జనరేటర్ సౌకర్యం, పోస్టుమార్టం గదిలో శవాన్ని భద్రపరిచేందుకు ఫ్రీజర్ ను ఏర్పాటు చేసి,ఆస్పత్రిలో తక్షణమే డయాలసిస్ సెంటర్ ను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారులకు అందజేశారు.ఆసుపత్రి సమస్యలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి,మండల నాయకులు ఎ. వీరాస్వామి, వి.వెంకటేశ్వర్లు,ఐద్వా మండల అధ్యక్ష,కార్యదర్శులు చింతా మౌనిక,మల్లెల నాగమణి, కె. ఈశ్వర్ లింగం,ఎస్.కె మౌలానా, కె.రామకృష్ణ,వార్డు సభ్యులు ఎల్. పూర్ణచందర్రావు,జి. వీరభద్రం, వి.ఇస్తారి,బి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యాన్ని విక్రయించాలి

- బియ్యం ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలి
- జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్..



భూపాలపల్లి నవంబర్ 3 పీపుల్స్ డైరీ. భూపాలపల్లి జిల్లాలోని బియ్యం వ్యాపారులు, కిరాణా దుకాణాల యజమానులు తమ దుకాణాల్లో వినియోగదారులకు స్పష్టంగా కనిపించే విధంగా బియ్యం ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలని జిల్లా పౌర సరఫరాల అధికారి కిరణ్ ఆదేశించారు. మంగళవారం ఐడిఓసీలో పౌర సరఫరాల అధికారి కార్యాలయంలో బియ్యం వ్యాపారులు, కిరాణా అసోసియేషన్ ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యాన్ని విక్రయించాలని స్పష్టం చేశారు. నిర్ణీత ధరల కంటే అధికంగా వసూలు చేసినా, ధరల పట్టికలు ప్రదర్శించకపోయినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బియ్యం రకాల వారీగా గరిష్ట విక్రయ ధరలు

బీపీటీ / కేఎన్ఎం రకం -- కిలో రూ. 66 ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా -- కిలో రూ. 74 హెచ్ఎంటీ / జేఎస్ఆర్ -- కిలో రూ. 79 ప్రతి దుకాణంలోనూ పై ధరల వివరాలతో కూడిన పట్టికలను వెంటనే ఏర్పాటు చేయాలని, నాణ్యమైన బియ్యాన్ని నిర్ణీత ధరలకే వినియోగదారులకు అందించాలని వ్యాపారులకు సూచించారు. వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని వ్యాపారులందరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాపౌర సరఫరాల సంస్థ డిఎం రాములు, తూనికలు కొలతల అధికారి శ్రీలత, మార్కెటింగ్ అధికారి , సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అధికారులు, పౌర సరఫరాల శాఖ రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, కిరాణా అసోసియేషన్ అధ్యక్షుడు, రైస్ ట్రేడర్స్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశాన్ని నిరసిస్తూ బీజేపీ వినతిపత్రం



సైదాపూర్ నవంబర్ 3 (పీపుల్స్ డైరీ,) : సైదాపూర్ మండలంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని నిరసిస్తూ, మండలంలోని ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ నాయకులు మండల స్పెషల్ అధికారి జిల్లా పంచాయతీ అధికారి బి జగదీశ్వర్ వినతిపత్రం సమర్పించారు సైదాపూర్ మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని, ఎన్నికల హామీ మేరకు పాత పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల మంజూరు చేపట్టాలని, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద తులం బంగారంతో పాటు రూ. 1,00,116 అందించాలని భాజపా మండల అధ్యక్షులు దెంచనాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లను నిజమైన అర్హులకే కేటాయించాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలు సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు అందించి గిట్టుబాటు ధర కల్పించాలని జిల్లా కార్యవర్గ సభ్యులు అయిలేని మధుమోహన్ రెడ్డి కోరారు.ప్రజా సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి హామీలను అమలు చేయాలని బీజేపీ మండల ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, రాజ మోర్చా మండల అధ్యక్షులు బీజేవైఎం జిల్లా నాయకులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు మరియు కార్యకర్తలు డిమాండ్ చేశారు.

కొత్తకొండ శ్రీ వీరభద్రస్వామి ఆలయ హుండీ లెక్కింపు

ఆదాయం రూ.4,57,235



భీమదేవరపల్లి, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలోని శ్రీ వీరభద్రస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమం శ్రీ పి. ప్రసాద్, ఈఓ,పరిశీలకుల ఆధ్వర్యంలో జరిగింది. హుండీ లెక్కింపులో నోట్ల రూపంలో రూ. 4,28,047, నాణేల రూపంలో రూ. 29,188 కలిపి మొత్తం రూ. 4,57,235 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పి. కిషన్ రావు తెలిపారు. అలాగే హుండీ ద్వారా మిశ్రమ వెండి 398 గ్రాములు, మిశ్రమ బంగారం 600 మిల్లీగ్రాములు లభించాయి. విదేశీ కరెన్సీలో ఒక అమెరికన్ డాలర్ నోటు రెండు, 20 డాలర్ల నోటు ఒకటి కలిపి మొత్తం మూడు డాలర్ నోట్లు లభించినట్లు తెలిపారు. ఈ హుండీ లెక్కింపు కార్యక్రమంలో శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి, సిరిసిల్ల సభ్యులు, శ్రీ సరస్వతి సేవా సమితి, కొత్తకొండ సభ్యులు, గ్రామ పెద్దలు, పుర ప్రముఖులు, భక్తులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాలిన చేను కూలిన రైతు..

కోతకు వచ్చిన వరి నీటిపాలు...నల్లబారుతున్న పత్తి పంట...



మహబూబాబాద్-నవంబర్ 03(పీపుల్స్ డైరీ) అకాల వర్షం రైతు ఆశలను ఆవిరి చేసింది.అకాల వర్షంతో వరి, పత్తి,మిర్చి,మొక్కజొన్న పంటలు నేలకొరిగాయి.పంట చేతికొచ్చే వేళ నష్టపోవాల్సి వచ్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు అన్నదాతలను ఆందోళనకు గురిచేస్తున్నాయి.ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి.కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పొలాల్లో వర్షపు నీరు చేరడంతో పంట నీట మునిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మరోవైపు పత్తి పంటపై వర్షాల ప్రభావం పడటంతో కాయలు, పత్తి నల్లబారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పెట్టుబడులు పెట్టి, అప్పులు చేసి పంటలు సాగు చేసిన రైతులకు ప్రకృతి వైపరీత్యం తీరని నష్టాన్ని మిగిల్చింది.ఇప్పటికే సాగు ఖర్చులతో సతమతమవుతున్న రైతులకు ఈ వర్షాలు మరింత భారంగా మారాయి.సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేయాలని,పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం అందించి ఆదుకోవాలని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేయాలనీ అన్నదాతలు కోరుతున్నారు.

స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పదో తరగతి క్లాస్‌మేట్స్

మృతి చెందిన మిత్రుడి కుటుంబానికి రూ.30 వేల ఆర్థిక సహాయం



భీమదేవరపల్లి, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కాల్వ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాజు మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.ఈ నేపథ్యంలో రాజుతో కలిసి పదో తరగతి చదువుకున్న క్లాస్‌మేట్స్ మంగళవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజు... స్నేహితులు గజ్జెల సురేష్,తమకున్న అనుబంధాన్ని, పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.అనంతరం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించిన క్లాస్‌మేట్స్ రూ.30,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపద సమయంలో తమ స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పదో తరగతి క్లాస్‌మేట్స్‌ను గ్రామస్తులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కాల్వ రాజు పదో తరగతి క్లాస్‌మేట్స్ అంబాల అనిల్,గిద్దె అజయ్,వొల్లాల హరీష్ ,మహేశా రాజు,తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత



రేగొండ నవంబర్ 3 పీపుల్స్ డైరీ..ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రేగొండ పోలీసులు పట్టుకున్నారు.రేగొండ మండల పరిధిలో మంగళవారం ఎలాంటి అనుమతులు లేకుండా మానేరు వాగు నుండి హన్మకొండ జిల్లా పరకాల మండలానికి ఇసుక తర లిస్తున్నట్లు రేగొండ పోలీసులకు సమాచారం అందింది. నమ్మదగిన సమాచారం మేరకు రూపిరెడ్డి పల్లి పరకాల సమీపంలో పోలీసులు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని రేగొండ మండల కేంద్రానికి చెందిన డ్రైవర్ రాజుని విచారించారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్ రాజు, ఓనర్ పట్టేం కోటి లింగం పై పోలీసులు కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై సుధాకర్ మాట్లాడుతూ.ప్రభుత్వ అనుమతులు లేకుండ ఇసుక తవ్వడం,తరలించడం లేదా అక్రమంగా రవాణా చేయడం చట్టరీత్య నేరమని ఇలాంటి చర్యలకు పాల్పడేవారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై సుధాకర్ హెచ్చరించారు..

పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 04 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 225
4

రూ. 49 కోట్లు మానేరు వాగులో పోసినట్లేనా..?

- కలగానే మానేరు వాగు పై వంతెన నిర్మాణం
- పదేండ్లు దాటిన అసంపూర్తిగా వంతెన నిర్మాణం
- బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు..?



చిట్యాల, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : దేవుడు వరమిచ్చినా పూజారి వరం ఇవ్వని విధంగా ఉంది మానేరు వాగుపై వంతెన నిర్మాణం. రెండు జిల్లాల ప్రజల బాధను అర్థం చేసుకొని ప్రభుత్వాలు ఎట్టకేలకు మానేరు వాగుపై వంతెన నిర్మాణానికి 2016లో రూ. 49 కోట్లను మంజూరు చేశాయి. కానీ కాంట్రాక్టర్లు కమిషన్లకు కక్కుర్తి పడి నాణ్యత రహితంగా బ్రిడ్జి నిర్మాణం చేయడంతో నేటి వరకు ఆ బ్రిడ్జి పునాదుల్లోనే ఉంది. ఒక్క సంవత్సరంలోపే పూర్తి కావాల్సిన మానేరు వాగుపై బ్రిడ్జి 10 సంవత్సరాలు దాటిన ఇప్పటివరకు ఇంకా పునాదుల్లోనే నిర్మాణ దశలు ఉండడం గమనార్హం. రూ. 49 కోట్ల రూపాయలు మానేరు వాగులో పోసినట్లేనా అని రెండు జిల్లాల ప్రజలు ఆరోపిస్తూ వ్యంగంగా విమర్శిస్తున్నారు. గరిమిళ్ళపల్లి– ఓడేడు గ్రామాల మధ్య గల మానేరు వాగుపై వంతెన నిర్మాణం కలగానే మిగిలిపోనుందా అని జయశంకర్ భూపాలపల్లి – పెద్దపల్లి రెండు జిల్లాల ప్రజలు చర్చించుకుంటున్నారు. దాదాపు పది సంవత్సరాలు దాటిన నేటి వరకు వంతెన నిర్మాణ పనులు పూర్తి కాకపోవడం వెనక ఏ విధమైన రాజకీయ కోణం దాగి ఉంది అని ప్రజలు పలు విమర్శలు గుప్పిస్తున్నారు.

ఏది ఏమైనా ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ప్రజల కోసమే పనిచేస్తాయి. కానీ రెండు జిల్లాల బంధాలను కలిపే మానేరు వాగుపై వంతెన నిర్మాణాన్ని ఏ ప్రభుత్వాలు కూడా పట్టించుకోకపోవడానికి గల కారణాలు ఏమిటని రెండు జిల్లాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఒక్క మానేరు వాగుపై వంతెన నిర్మాణం జరిగితే రెండు జిల్లాల బంధాలు వ్యాపార వాణిజ్య సంబంధాలు అభివృద్ధి మూలాలు శరవేగంగా జరుగుతాయి. పూర్తి వివరాల్లోకి వెళితే ... జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని గర్మిళ్లపల్లి – పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామాల మధ్య మధ్య మానేరు వాగుపై నిర్మాణంలో ఉన్న వంతెన నిర్మాణ పనులకు పదేళ్లుగా నిర్లక్ష్యం అనే గ్రహణం పట్టుకుంది. పనులకు శంకుస్థాపన చేసి వదిలేసి పది సంవత్సరాలు గడిచిన పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఈ బ్రిడ్జి నిర్మాణం అలాగే మిగిలిపోయే విధంగా ఉంది. బ్రిడ్జి నిర్మాణ పనులు మొదలై దాదాపు పది సంవత్సరాలు కావస్తున్న ఇంతవరకు పూర్తిగా కాకపోవడం ఇంకా పిల్లర్ల దశలోనే ఉండడం నిర్మాణం జరిగినవి కూలిపోవడం పట్ల రెండు జిల్లాల ప్రజానీకం ఆందోళన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పెద్దపల్లి జిల్లాల మధ్య గల దూరాన్ని తగ్గించేందుకు మానేరు వాగు నదిపై 2016లో రూ. 49 కోట్ల అంచనా వ్యయంతో మానేరు వాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించారు. కానీ కాంట్రాక్టర్ల మార్పు నిధుల కొరతతో వంతెన నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. నేటి వరకు వంతెన నిర్మాణ పనుల్లో పురోగతి ఏమాత్రం లేదు. 2024 జూలై నెలలో ఈదురు గాలివాన బీభత్సానికి బ్రిడ్జి గర్డర్లు కూలిపోయాయి. ఒక వేళ ఈ మానేరు వాగుపై వంతెన నిర్మాణం జరిగితే ప్రజల ప్రాణాలకు ఏమైనా ప్రమాదం పొంచి ఉంది అని కూడా ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి కారణం బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడమే. కేవలం గాలివానలకే గర్డర్లు కూలితే బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యాక వాహనాలు భారీ వాహనాలు ప్రయాణిస్తే ఏమవుతుందో అని ప్రజలు వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ వంతెనకు శంకుస్థాపన చేసి దాదాపు పది సంవత్సరాలైనా కూడా నిర్మాణంలో పురోగతి లేకపోవడం వెనుక ప్రభుత్వాల నిర్లక్ష్యమే కారణమని స్పష్టంగా తెలుస్తోంది. 2024 ఏప్రిల్ నెలలో మొదటిసారి బ్రిడ్జి గర్డర్లు గాలి దుమారానికి కూలిపోయాయి. సంబంధిత కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం మూలంగానే బ్రిడ్జి గర్డర్లు పలుమార్లు కూలిపోవడం జరుగుతుందని అప్పటి అధికారులు తేల్చారు. మానేరు వాగు పై బ్రిడ్జి నిర్మాణ పనుల పట్ల రెండు జిల్లాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2024 జూలై నెలలో వీచిన గాలివాన బీభత్సానికి గర్డర్లు పడిపోవడం 17, 18 పిల్లర్ల మధ్య గల 4 గర్డర్లు ఒకేసారి పెద్ద శబ్దం చేస్తూ కూలిపోయాయి. ఆ సమయంలో చుట్టుపక్కల ఉన్నవారు భయాందోళనకు గురయ్యారు. అవి కూలిన సమయంలో పక్కనే పనిచేసే కూలీలు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. 2024 ఏప్రిల్ 22న కూడా గాలివాన బీభత్సంతో వంతెనకు సంబంధించిన ఓడెడు వైపు గల మూడు గర్డర్లు నేలకూలాయి. కాంట్రాక్టర్ నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతోనే ఈ విధంగా గర్డర్లు కూలిపోవడం జరిగిందని మధ్యలోనే ఆగిపోయింది. ఈ మానేరు వాగుపై నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి ప్రతిసారి కూలిపోవడంతో ఈ వంతెన నాణ్యతపై ప్రజలు నమ్మకంగా లేరు. కాంట్రాక్టర్ కాసులకు కక్కుర్తి పడి నాణ్యత లోపంతో నిర్మాణాలు చేయడం మూలంగానే అవి కూలుతున్నాయని ఇంజనీర్ల పర్యవేక్షణ లేకపోవడం కూడా కారణమని అని రెండు జిల్లాల ప్రజలు విమర్శలు చేస్తున్నారు. నిర్మాణ సమయంలోనే పలుమార్లు వచ్చిన వానలకు వరదలకు బ్రిడ్జి నిర్మాణ సామాగ్రి దెబ్బతినడం కాంట్రాక్టర్ మారడంతో పనుల్లో జాప్యం జరుగుతోంది. బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుతున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న ఈ వంతెన నిర్మాణం పూర్తి కాకముందే మధ్యలోనే కూలిపోవడం వెనుక కారణాలు వెలికి తీసి సంబంధిత బాధ్యులు నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇటీవల కాలంలో మానేరు వాగులో రాకపోకలు సాగించేందుకు తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం చేసిన ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి రోడ్డు తెగిపోయింది. అలాగే గతంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం ఇసుక రవాణాకు మానేరు వాగులో దిగిన ట్రాక్టర్లు వరద ఉధృతి పెరిగి కొట్టుకుపోయే పరిస్థితి రాగా రైతులు మండల పోలీసులు నలుగురు వ్యక్తులను రక్షించి కాపాడారు. ఈ బ్రిడ్జి నిర్మాణం కాకపోవడం వలన రెండు జిల్లాల మధ్య గల రాకపోకలు ప్రతి వర్షాకాలంలో ఆగిపోతున్నాయి. బ్రిడ్జి నిర్మాణంలో జాప్యం జరుగుతుండడంతో రెండు జిల్లాల మధ్య గల వ్యాపార బంధాలు కూడా నిలిచిపోయాయి. పిల్లర్స్ కాలువలు మధ్య గల బ్యాలన్స్ కోసం వేసిన చెక్క ముక్కలు కూడా దెబ్బతిన్నాయి. ఈ వంతెన నిర్మాణంలో భాగంగా నాసిరకం సిమెంటు సామాగ్రిని వాడడం మూలంగానే బ్రిడ్జి గడ్డర్లు కూలిపోయాయి. కాంట్రాక్టర్లు కమిషన్లు దండుకుంటున్న శ్రద్ధ బ్రిడ్జి నిర్మాణ పనులపై చూపడం లేదని ప్రజలు నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మంత్రి శ్రీధర్ బాబు అలాగే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు స్పందించి నాణ్యతను పాటించే విధంగా కాంట్రాక్టర్లను ఆదేశాలు జారీ చేసి బ్రిడ్జి పనులు తొందరగా పూర్తి చేయాలని ఉమ్మడి జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మృతుడి కుటుంబానికి మేఘన ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ అండ

- కాల్వ రాజు కుటుంబానికి 30 కిలోల బియ్యం, రూ.2,500 ఆర్థిక సహాయం



భీమదేవరపల్లి, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడమే మానవత్వానికి నిదర్శనమని చాటి చెబుతూ మేఘన ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు, వంగర గ్రామానికి చెందిన కొండి పాముల సుహాసిని మృతుడు కాల్వ రాజు కుటుంబానికి ఆర్థిక, నిత్యావసర సహాయం అందించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన కాల్వ రాజు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. రాజు మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఈ విషయం తెలుసుకున్న సుహాసిని మంగళవారం రాజు నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజుతో తనకున్న పరిచయాన్ని, ఆయన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం రాజు కుటుంబ సభ్యులను పరామర్శించి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. కుటుంబానికి తమ వంతు సహకారంగా 30 కిలోల బియ్యంతో పాటు రూ. 2,500 ఆర్థిక సహాయాన్ని సుహాసిని అందజేశారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి అండగా నిలిచిన ఆమెకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. మృతుడి కుటుంబానికి సుహాసిని అందించిన సహాయం పట్ల గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, మానవతా దృక్పథంతో సేవ చేయడం అభినందనీయమని గ్రామస్తులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో వార్డ్ సభ్యులు మారం సతీష్,గ్రామ నాయకులు బత్తిని అశోక్, రాజు తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరువు మండలాలుగా గుర్తించాలి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్



హుస్నాబాద్ టౌన్: (పీపుల్స్ డైరీ) నవంబర్ 03 : ఎల్ నినో ప్రభావంతో సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, కరువు పరిస్థితుల కారణంగా ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మూడు మండలాలను కూడా కరువు మండలాలుగా గుర్తించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ఎల్ నినో ప్రభావంతో వర్షాలు సరిగా కురవకపోవడంతో ఆయా మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడటంతో పాటు రానున్న రోజుల్లో తాగునీటి సమస్యలు సైతం ఎదురయ్యే అవకాశం ఉందని మంత్రి తన లేఖలో పేర్కొన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని మొత్తం ఏడు మండలాల్లో ఇప్పటికే రెండు మండలాలను మాత్రమే కరువు మండలాలుగా గుర్తించారని, మిగిలిన ఐదు మండలాల్లోనూ తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సిద్దిపేట జిల్లా పరిధిలోని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కూడా కరువు మండలాలుగా ప్రకటించాలని ముఖ్యమంత్రిని కోరారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తమ మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని కోరుతూ ఆయా మండలాలు, గ్రామాల్లో ప్రజలు ఏకగ్రీవ తీర్మానాలు చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజలు, రైతుల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలను కరువు మండలాలుగా గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి నవంబర్ 5న సమావేశం

భీమదేవరపల్లి, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : భీమదేవరపల్లి, వేలేరు మండలాల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదిక (సీజీఆర్ఎఫ్ --1, వరంగల్) ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ కె. మాధవరావు తెలిపారు. భీమదేవరపల్లి, కొత్తకొండ, వేలేరు సెక్షన్ల పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం నవంబర్ 5న గురువారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కొత్తకొండలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో ఈ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ కనెక్షన్లు, విద్యుత్ బిల్లులు, మీటర్ సమస్యలు, విద్యుత్ సరఫరా అంతరాయాలు, కొత్త కనెక్షన్లు, విద్యుత్ సేవలకు సంబంధించిన ఇతర సమస్యలు ఉన్న వినియోగదారులు సమావేశానికి హాజరై తమ ఫిర్యాదులను నేరుగా జ+=ళీ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. వినియోగదారులు తమ ఫిర్యాదులకు సంబంధించిన వివరాలు, అవసరమైన పత్రాలను వెంట తీసుకురావాలని సూచించారు. అలాగే గ్రామ సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తమ పరిధిలోని ప్రజలకు సమావేశం గురించి తెలియజేసి, సమస్యలు ఉన్న విద్యుత్ వినియోగదారులు హాజరయ్యేలా సహకరించాలని కోరారు. గ్రామాల్లోని సామూహిక విద్యుత్ సమస్యలను కూడా ఈ సమావేశం ద్వారా ఫోరం దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి చర్యలు తీసుకునేలా సహకరించాలని కె. మాధవరావు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ ట్రాక్టర్లతో వాణిజ్య రవాణా

మూడు ట్రాక్టర్లు సీజ్ చేసిన రవాణాశాఖ అధికారులు..



భూపాలపల్లి నవంబర్ 3 పీపుల్స్ డైరీ.. భూపాలపల్లి: వ్యవసాయ అవసరాల కోసం వినియోగించాల్సిన ట్రాక్టర్లతో వాణిజ్య రవాణా చేపడుతున్న వారిపై భూపాలపల్లి రవాణాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వ్యవసాయ ట్రాక్టర్లను కమర్షియల్ అవసరాలకు ఉపయోగిస్తూ మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. పట్టణంలోని మంజూరు నగర్, బాంబులగడ్డ ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అవసరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్న ట్రాక్టర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తూ మట్టి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న మూడు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్లు ఫహీమ సుల్తానా, శ్రీనివాస్ పాల్గొన్నారు. వ్యవసాయ ట్రాక్టర్లను వాణిజ్య రవాణాకు వినియోగించడం నిబంధనలకు విరుద్ధమని, నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై తనిఖీలు కొనసాగిస్తూ చర్యలు తీసుకుంటామని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు..

ఆశాలకు 18 వేల వేతనం చెల్లించాలి



మహబూబాబాద్-నవంబర్ 03(పీపుల్స్ డైరీ) : చాలి చాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఆశ వర్కర్లకు నెలకు రు.18 వేల రూపాయలు ఫిక్స్ డ్ వేతనాన్ని నిర్ణయించి నెల నెల చెల్లించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు.ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్ లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలం లోని ముల్కనూర్ లో ఉన్న పీహెచ్ సీ సెంటర్ ఎదుట మంగళవారం తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా డే సందర్భంగా ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఆశాలు గర్భిణీలను ప్రభుత్వ ఆస్పత్రిలో డెలివరీ అయ్యే విధంగా చూస్తూ తల్లి, బిడ్డ ల ప్రాణాలను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే డిసెంబర్ 15 నుండి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.సమ్మెకు సంబంధించిన నోటీసును వైద్య అధికారి హనుమంతరావు కు అందజేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ ఆశా అధ్యక్షులు నమ్మి,కార్యదర్శి పి రమాదేవి,జిల్లా నాయకులు రమణ, కౌసల్య, ఉమాదేవి,సుజాత, దర్శి,సుజాత, పుష్ప, ఆశకుమారి, జ్యోతి, నీల,భద్రమ్మ, సోనీ, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ బావిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం

సింగాపూర్ శివారులో ఘటన.. జేసీబీ సాయంతో మృతదేహం వెలికితీత



హుజూరాబాద్, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ): హుజూరాబాద్ మండల పరిధిలోని సింగాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారి 563 సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. బావిలో మృతదేహం తేలియాడుతుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు, అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సహాయంతో సహాయక చర్యలు చేపట్టారు. అనంతరం బావిలో నుంచి మృతదేహాన్ని వెలికితీశారు.

ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా అనుమానం : మృతుడు నీలం రంగు షర్ట్, జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అలాగే మెడలో బాబా తాయెత్తు ఉన్నట్లు తెలిపారు. స్థానికులు ఎవరూ మృతుడిని గుర్తించకపోవడంతో ఇతర రాష్ట్రాలకు చెందిన వ్యక్తి అయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. అయితే మృతుడి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

పోలీసుల దర్యాప్తు ప్రారంభం : మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూరాబాద్ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ సహాయక చర్యల్లో ఫైర్ ఏఎల్ఎఫ్ తిరుపతి, ఫైర్ ఫైటర్ కే. వెంకటేశ్, సిబ్బంది ఎం. అశోక్, పి. తిరుపతి తదితరులు పాల్గొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతుడి వివరాలు తెలుసుకునేందుకు దర్యాప్తు ప్రారంభించారు.

పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు తగిన గుర్తింపు

లేబర్ సెల్ కో-కన్వీనర్‌గా మద్దుల చంద్రప్రకాష్ రెడ్డి నియామకం

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 03 : మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అర్బన్ బీజేపీ లేబర్ సెల్ కో-కన్వీనర్‌గా ప్రశాంత్ నగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మద్దుల చంద్రప్రకాష్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావును ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు చంద్రప్రకాష్ రెడ్డిని శాలువాతో సత్కరించి, నూతన బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాజేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో, క్రమశిక్షణతో నిరంతరం పనిచేస్తూ ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్త సేవలను పార్టీ గుర్తిస్తుందని, వారి శ్రమకు తగిన విధంగా బాధ్యతలు, అవకాశాలు కల్పిస్తుందని పేర్కొన్నారు.

పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 04 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 225

చాగంటి ప్రవచనాల పేరుతో జమ్మికుంటలో కొత్త వివాదం!

- ధర్మం బోధించే వేదికపై మీడియాకు అవమానం..
- ఇదేనా ఆధ్యాత్మిక సంస్కారం?
- వీడియోలు తీయొద్దు.. మీడియా అవసరం లేదు.. మరి ప్రజలకు సమాచారం అందించేది ఎవరు?
- చాగంటి కోటేశ్వరరావు రాక వెనుక అసలు లక్ష్యం ఏమిటి?
- అన్నపూర్ణ సేవా సమితి ఎవరి కోసం? ఆర్యవైశ్యులకే పరిమితమా?
- అన్నదానం పేరుతో విరాళాల సేకరణపై పారదర్శకత ఏది?
- పేదలు, బడుగు బలహీన వర్గాలకు చోటేది? పుర ప్రముఖుల మౌనం వెనుక కారణమేంటి?



జమ్మికుంట, నవంబర్ 03పీపుల్స్ డైరీ : ఆధ్యాత్మికత అంటే అహంకారాన్ని విడిచిపెట్టడం.. ధర్మం అంటే అందరినీ సమానంగా చూడటం.. సేవ అంటే ఆకలితో ఉన్న పేదవాడికి అండగా నిలవడం.. మరి జమ్మికుంట పట్టణంలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలు ఈ విలువలకు విరుద్ధంగా కనిపిస్తున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రవచనాల పేరుతో భారీ ఏర్పాట్లు, ప్రచార ఆర్భాటం ఒకవైపు.. కార్యక్రమానికి వచ్చిన మీడియా ప్రతినిధులకు వీడియోలు తీయొద్దని ఆంక్షలు మరోవైపు! ఇదేనా ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ తీరు? ధర్మం గురించి గంటల తరబడి ప్రవచనాలు చెప్పే వేదికపై మీడియా గౌరవానికి చోటు లేదా? ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఎవరిపై ఉంది?

చాగంటి గారూ.. ప్రవచనాలు ప్రజల కోసమా? కొందరి కోసమేనా?

చాగంటి కోటేశ్వరరావు అంటే ఆధ్యాత్మిక ప్రవచనాల ద్వారా లక్షలాది మందికి పరిచయమైన పేరు. ఆయన చెప్పే ధర్మ సందేశాలు ప్రజల్లోకి వెళ్లాలంటే ప్రచార మాధ్యమాల పాత్ర కూడా కీలకమే. అలాంటప్పుడు జమ్మికుంటకు వచ్చిన ఆయన ప్రవచన కార్యక్రమంలో మీడియా ప్రతినిధులను ఎందుకు వెనక్కి పంపించాల్సి వచ్చింది? వీడియోలు తీయొద్దు.. మీరు ఎవరు తీయడానికి.. మీడియా అవసరం లేదు అనే తరహా మాటలు వినిపించాయని విలేకరులు ఆరోపిస్తున్నారు. మరి ఈ ఆంక్షలు ఎవరి ఆదేశాలతో విధించారు? చాగంటి వారి బృందం సూచించిందా? నిర్వాహకుల నిర్ణయమా? లేక అక్కడి ఇతర వ్యక్తుల అత్యుత్సాహమా? ప్రజలకు ధర్మం గురించి చెప్పే ప్రవచనాలు ప్రజలందరికీ చేరకూడదా? ఒక ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో మీడియా పాత్రను గుర్తించలేరా? మీడియా ప్రతినిధులు కార్యక్రమానికి వచ్చి వార్తలు రాయడం, చిత్రీకరించడం తప్పా? ఆధ్యాత్మిక వేదికపై మీడియా ప్రతినిధుల ఆత్మగౌరవానికి భంగం కలిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారు?

మీడియా కావాలంటే ప్రచారం.. వార్తలు రాయాలంటే ఆంక్షలా?

కార్యక్రమం నిర్వహించాలంటే ముందుగా పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం అవసరమవుతుంది. కార్యక్రమానికి ప్రజలు రావాలంటే సమాచారం ప్రజలకు చేరాలి. ఆ పని చేసేది మీడియానే. మరి కార్యక్రమానికి ముందు మీడియా అవసరం.. కార్యక్రమం జరిగే సమయంలో మాత్రం మీడియా అవసరం లేదా? ప్రచారం కావాల్సినప్పుడు విలేకరులు గుర్తుకొస్తారు.. వార్తలు సేకరించడానికి వస్తే మాత్రం అడ్డంకులా? ఇదెక్కడి ద్వంద్వ వైఖరి? మీడియా ప్రతినిధులు ఎవరి వ్యక్తిగత ప్రచారం కోసం అక్కడికి వెళ్లలేదు. ప్రజలకు సంబంధించిన కార్యక్రమాన్ని ప్రజలకు తెలియజేయడమే వారి బాధ్యత. ప్రజలకు ఉపయోగపడే సమాచారాన్ని అందించడమే మీడియా ధర్మం. అలాంటి మీడియాను అవమానించే హక్కు ఎవరికీ లేదు. కార్యక్రమం నిర్వహిస్తున్నామనే కారణంతో ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన మీడియాను తక్కువ చేసి చూడటం ఎంతవరకు సమంజసం?

అన్నపూర్ణ సేవా సమితి.. సేవా సంస్థనా? ఒక వర్గం ఆధిపత్య వేదికనా?

ఇక్కడ మరో ప్రధాన ప్రశ్న అన్నపూర్ణ సేవా సమితి నిర్వహణపై. అన్నపూర్ణ అంటే ఆకలితో ఉన్న ప్రతి ఒక్కరికీ అన్నం పెట్టే భావన. సేవా సమితి అంటే సమాజంలోని అన్ని వర్గాలకు సేవ చేయాల్సిన సంస్థ. మరి ఈ సమితిలో ఆర్యవైశ్య సంఘం నాయకులకే ప్రాధాన్యత ఉందా? ఇతర సామాజిక వర్గాలకు అవకాశం లేదా? పేదలు, దళితులు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కల్పిస్తున్నారా? లేక కొందరి ఆధిపత్యంలోనే కార్యక్రమాలు కొనసాగుతున్నాయా? అన్నదానం అనేది కులం, మతం, ప్రాంతం, హోదాతో సంబంధం లేని పవిత్రమైన సేవ. ఆకలితో వచ్చిన వ్యక్తికి కులం అడిగి అన్నం పెట్టరు. అలాంటప్పుడు అన్నపూర్ణ సేవా సమితి కార్యకలాపాల్లో అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యత ఉందా లేదా అనే విషయాన్ని నిర్వాహకులు స్పష్టం చేయాలి. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్థ అయితే దాని నిర్మాణం, విధివిధానాలు ప్రజలకు తెలియజేయాలి. ప్రజల కోసం చేస్తున్న సేవా కార్యక్రమం అయితే ప్రజల భాగస్వామ్యానికి తలుపులు తెరవాలి.

అన్నదానం పేరుతో నిధుల సేకరణ.. లెక్కలు ప్రజలకు తెలియాలి!

చాగంటి వంటి ప్రముఖ ప్రవచనకర్తను ఆహ్వానించడం, వేదికలు ఏర్పాటు చేయడం, ఇతర ఏర్పాట్లు చేయడం వెనుక ఎంత ఖర్చు అవుతోంది? ఆ ఖర్చులకు నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? విరాళాలు ఎవరి నుంచి సేకరిస్తున్నారు? సేకరించిన నిధులు ఏ విధంగా వినియోగిస్తున్నారు? అన్నపూర్ణ సేవా సమితి ఆదాయ వ్యయాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అన్నదానం పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తే వాటి ప్రయోజనం పేదలకు ఎంతవరకు చేరుతోంది? సేవా కార్యక్రమాల పేరుతో పెద్ద పెద్ద వేదికలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే లక్ష్యమా? లేక నిజంగా ఆకలితో ఉన్న నిరుపేదలకు అండగా నిలవడమే లక్ష్యమా? ధనార్జన జరుగుతోందని వస్తున్న విమర్శలకు తావులేకుండా నిర్వాహకులు పూర్తి వివరాలు వెల్లడించాలి. ఆరోపణలకు సమాధానం చెప్పాల్సింది మౌనం కాదు.. పారదర్శకత.

చాగంటి ప్రవచనాలతో లబ్ధి ఎవరికి?

జమ్మికుంటకు చాగంటి కోటేశ్వరరావు రావడం వల్ల పట్టణ ప్రజలకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మిక సందేశాలు ఎంతమందికి చేరాయి? పేద కుటుంబాలకు ఎలాంటి సహాయం అందింది? విద్యార్థులకు, యువతకు, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టారు? కేవలం ఒకరోజు ప్రవచనాలు నిర్వహించి భారీ ప్రచారం పొందడమే కార్యక్రమ లక్ష్యమా? లేక ఆధ్యాత్మికతను సామాజిక సేవతో అనుసంధానం చేయాలనే ఉద్దేశం ఉందా? ప్రవచనాలు విన్న ప్రజలు ఇంటికి వెళ్లిన తర్వాత ఆచరించాల్సిన విలువలు ఏమిటి? సమాజంలో అసమానతలు తొలగించడానికి ఏ సందేశం ఇచ్చారు? సేవాభావం పెంపొందించడానికి నిర్వాహకులు తీసుకున్న చర్యలేమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకపోతే కార్యక్రమం నిర్వహణపై ప్రజల్లో సందేహాలు రావడం సహజం.

పుర ప్రముఖుల మౌనం ఎందుకు?

జమ్మికుంట పట్టణంలో ఎన్నో సామాజిక, రాజకీయ, వ్యాపార, సేవా రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. మీడియా ప్రతినిధుల పట్ల జరిగిన వ్యవహారాన్ని వారు గమనించలేదా? మీడియా గౌరవానికి భంగం కలిగినప్పుడు స్పందించాల్సిన బాధ్యత లేదా? ఆధ్యాత్మిక కార్యక్రమం కాబట్టి ప్రశ్నించకూడదా? ఎవరు నిర్వహించినా ప్రజలకు సంబంధించిన కార్యక్రమాలపై ప్రశ్నించే హక్కు మీడియాకు ఉంటుంది. ప్రశ్నించడం అంటే వ్యతిరేకించడం కాదు. సమాధానం కోరడం అంటే అవమానించడం కాదు. మీడియా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనం వహించడం సమస్యను పరిష్కరించదు.

ప్రవచన వేదికపై ధర్మం.. బయట మీడియాపై ఆంక్షలు!

ఒకవైపు ధర్మం, నీతి, మానవత్వం, సమానత్వం గురించి ప్రవచనాలు.. మరోవైపు అదే కార్యక్రమంలో మీడియా ప్రతినిధులకు అవమానకర పరిస్థితులు ఎదురవుతున్నాయనే ఆరోపణలు. ఈ రెండు పరిస్థితులను ప్రజలు ఎలా అర్థం చేసుకోవాలి? ఆధ్యాత్మికత అనేది కేవలం మాటల్లో ఉండాలా? ఆచరణలో కనిపించకూడదా? మీడియాను గౌరవించని వేదిక నుంచి సమాజానికి ఇచ్చే సందేశం ఎంతవరకు స్ఫూర్తిదాయకంగా ఉంటుంది? చాగంటి కోటేశ్వరరావు కార్యక్రమ నిర్వాహకులు, ఆయన బృందం ఈ వ్యవహారంపై స్పష్టత ఇవ్వాలి. మీడియా ప్రతినిధులను వీడియోలు తీయకుండా అడ్డుకున్నది ఎవరు? మీడియా అవసరం లేదని చెప్పిన వ్యక్తులు ఎవరు? ఈ నిర్ణయం వెనుక కారణమేంటి? కార్యక్రమానికి సంబంధించిన వార్తలు, దృశ్యాలు ప్రజలకు చేరకూడదనే ఉద్దేశం ఏమైనా ఉందా? లేక నిర్వహణలో సమన్వయ లోపమా? అనే విషయాలు వెల్లడించాలి.

ఇప్పటికైనా సమాధానం చెప్పాలి.. ప్రజలకు లెక్కలు చూపాలి!

జమ్మికుంటలో నిర్వహించిన ఈ కార్యక్రమం ఒక ఆధ్యాత్మిక వేదికగా మిగిలిపోకుండా ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు వేదిక కావాలి. అన్నపూర్ణ సేవా సమితి అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించాలి. అన్నదానం నిజమైన నిరుపేదలకు చేరాలి. విరాళాలు, ఖర్చుల విషయంలో పారదర్శకత ఉండాలి. మీడియా ప్రతినిధులను గౌరవించాలి. ఇవి ఎవరో అడుగుతున్న ప్రత్యేక హక్కులు కావు.. ప్రజాస్వామ్య వ్యవస్థలో కనీస బాధ్యతలు.

చివరిగా చాగంటి కోటేశ్వరరావుకు, అన్నపూర్ణ సేవా సమితి నిర్వాహకులకు ప్రజల తరపున కొన్ని సూటి ప్రశ్నలు..

1. జమ్మికుంటకు చాగంటి కోటేశ్వరరావును ఆహ్వానించడం వెనుక ప్రధాన ఉద్దేశం ఏమిటి? 2. ప్రవచన కార్యక్రమం ప్రజలందరికీ అందుబాటులో ఉందా? లేక కొందరికే పరిమితమా? 3. మీడియా ప్రతినిధులను వీడియోలు తీయొద్దని అడ్డుకున్నది ఎవరు? 4. చాగంటి వారి బృందం మీడియా చిత్రీకరణపై ఎలాంటి నిబంధనలు విధించింది? 5. అన్నపూర్ణ సేవా సమితిలో ఇతర సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం ఉందా? 6. పేదలు, బడుగు బలహీన వర్గాలకు సమితి ద్వారా అందుతున్న సేవలు ఏమిటి? 7. కార్యక్రమానికి వచ్చిన విరాళాలు, ఖర్చుల వివరాలు ప్రజలకు వెల్లడిస్తారా? 8. మీడియా ప్రతినిధుల పట్ల జరిగిన వ్యవహారానికి నిర్వాహకులు క్షమాపణ చెబుతారా?

ధర్మం చెప్పే వేదికపై అహంకారానికి చోటుండకూడదు. అన్నదానం చేసే సంస్థలో కుల, వర్గ భేదాలకు తావుండకూడదు. ప్రజలకు సమాచారం అందించే మీడియాను అవమానించే సంస్కృతికి అంతం పలకాలి. ప్రవచనాలు వినిపించడం గొప్ప కాదు.. వాటిలోని ధర్మాన్ని ఆచరణలో చూపించడమే అసలైన గొప్పతనం! ఇప్పటికైనా నిర్వాహకులు స్పందిస్తారా? లేక ప్రశ్నించే గొంతులను పట్టించుకోకుండా తమకేమీ సంబంధం లేదన్నట్లు వ్యవహరిస్తారా? జమ్మికుంట ప్రజలు సమాధానం కోసం ఎదురుచూస్తున్నారు.

మందుబాబుల ఆగడాలపై స్థానికుల ఆందోళన

సర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన ప్లెక్సీ చించివేత.. చిందరవందరగా మద్యం సీసాలు



భీమదేవరపల్లి:నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మండలంలోని రాంనగర్ మంగళపల్లి గ్రామపంచాయతీ ప్రాంగణంలో కొందరు మందుబాబులు హంగామా సృష్టించారు. సోమవారం రాత్రి గ్రామపంచాయతీ కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవించిన కొందరు వ్యక్తులు అక్కడ ఏర్పాటు చేసిన గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులతో కూడిన ప్లెక్సీని చించివేశారు. అంతేకాకుండా మద్యం సేవించిన అనంతరం ఖాళీ సీసాలను గ్రామపంచాయతీ ప్రాంగణంలోనే చిందరవందరగా పడవేశారు. గ్రామ ప్రజలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించే గ్రామపంచాయతీ ప్రాంగణంలో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణంలో మద్యం సేవిస్తూ, ప్రజాప్రతినిధుల ప్లెక్సీని ధ్వంసం చేయడం పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. మద్యం మత్తులో కొందరు వ్యక్తులు తరచూ గందరగోళం సృష్టిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు, పోలీసులు స్పందించి గ్రామపంచాయతీ ప్రాంగణంలో మద్యం సేవించి హంగామా సృష్టించిన వారిని గుర్తించి, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

'దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లం కాదు'.. అమిత్ షాకు మంత్రి అడ్లూరి కౌంటర్!

తప్పులుంటే బయటపెట్టాలని కేంద్రానికి సవాల్



కేంద్ర హోంమంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన నేపథ్యంలో తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్ర విమర్శలు చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తప్పులు చేస్తే కేంద్ర హోంశాఖ చేతిలో ఉన్న అధికారాలతో వాటిని బయటపెట్టాలని సవాల్ విసిరారు. జనాలను పోగేసి దమ్కీలు ఇస్తే భయపడేవాళ్లు ఇక్కడ ఎవరూ లేరని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ పేరు చెబితే బీజేపీ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. బడుగు, బలహీన వర్గాలు కాంగ్రెస్‌కు అండగా ఉన్నందునే వారి ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను బీజేపీ ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి నిజాయతీ ఉంటే ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని అడ్లూరి డిమాండ్ చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని వివిధ పార్టీలు కోరుతున్నా కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న ఉద్దేశమేంటని నిలదీశారు. రాజ్యాంగం ద్వారా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజలకు కల్పించిన ఓటు హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా వెనుక అదానీ, అంబానీ ఉన్నారని మంత్రి ఆరోపించారు. దేశ సంపదను ఆ ఇద్దరు పారిశ్రామికవేత్తల చేతుల్లో పెడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు, ఎన్నికల ప్రక్రియపై బీజేపీని లక్ష్యంగా చేసుకుని అడ్లూరి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అమిత్ షాతో భేటీపై సోషల్ మీడియాలో స్పందించిన చిరంజీవి, రామ్ చరణ్

ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగంపై ఆందోళన

అంశాన్ని పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హామీ



సోమవారం నాడు హైదరాబాదులో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కలిశారు. ఇటీవల సినీ పరిశ్రమను తీవ్రంగా ఆందోళనకు గురిచేస్తున్న ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగంపై వారు హోంమంత్రికి తమ ఆవేదనను తెలియజేశారు. ఈ సమస్యపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారి ఆందోళనను సావధానంగా విన్న అమిత్ షా, ఈ అంశాన్ని తక్షణమే పరిశీలించి కఠినమైన నిబంధనలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఈ భేటీపై చిరంజీవి, రామ్ చరణ్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "గౌరవనీయ హోంమంత్రి అమిత్ షా గారిని కలవడం సంతోషంగా ఉంది. ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగం వల్ల కళాకారుల హక్కులు, గౌరవానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందన్న నా ఆందోళనను ఆయనతో పంచుకున్నాను. ఆయన మా సమస్యను అర్థం చేసుకుని, ఈ అంశాన్ని ప్రభుత్వం వెంటనే పరిశీలిస్తుందని, కఠినమైన నిబంధనలు, శిక్షలు తీసుకొస్తామని హామీ ఇచ్చారు. రాతపూర్వకంగా వినతిపత్రం ఇవ్వాలని సూచించారు. ఈ వ్యవహారాన్ని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి గారు సమన్వయం చేస్తారని తెలిపారు. ఆయన హామీకి కృతజ్ఞతలు" అంటే చిరంజీవి ట్వీట్ చేశారు.రామ్ చరణ్ స్పందిస్తూ.. "ఈ రోజు నాన్నగారితో కలిసి హోంమంత్రి అమిత్ షా గారిని కలవడం గౌరవంగా భావిస్తున్నాను. డీప్‌ఫేక్ వల్ల కళాకారులపై, పరిశ్రమపై పడుతున్న తీవ్ర ప్రభావం గురించి మేం వివరించగా, ఆయన సానుకూలంగా స్పందించడం ప్రోత్సాహకరంగా ఉంది. ఈ అంశాన్ని ప్రభుత్వం వెంటనే పరిశీలించి కఠిన చర్యలు తీసుకుంటుందని ఆయన ఇచ్చిన హామీ మాకు ఎంతో ధైర్యాన్నిచ్చింది. మా ఆందోళనను అర్థం చేసుకుని, మద్దతు తెలిపినందుకు ఆయనకు కృతజ్ఞతలు" అని తెలిపారు.

అమ్మా తీసుకెళ్లు అంటూ గుండెలు పిండేసిన చిన్నారి.. చివరికి తల్లిదండ్రుల చెంతకు!

- మూడేళ్ల బాలుడు రుద్ర మహేశ్ తిరిగి దత్తత తల్లిదండ్రుల చెంతకు
- 'అమ్మా తీసుకెళ్లు' అంటూ చిన్నారి ఏడ్చిన వీడియో వైరల్
- తెలంగాణ హైకోర్టు జోక్యంతో సుఖాంతమైన కస్టడీ వివాదం
- చట్టబద్ధత కారణంతో బాలుడిని శిశు సంరక్షణ కేంద్రానికి తరలించిన అధికారులు

జగిత్యాల జిల్లాలో తీవ్ర ఉత్కంఠ రేపిన మూడేళ్ల బాలుడు రుద్ర మహేశ్ కస్టడీ వివాదం సుఖాంతమైంది. తెలంగాణ హైకోర్టు, జిల్లా యంత్రాంగం జోక్యంతో చిన్నారిని దాదాపు మూడేళ్లుగా పెంచుకుంటున్న దంపతులకు అధికారులు అప్పగించారు. వారాల తరబడి అనుభవించిన వేదనకు తెరపడటంతో ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కరీంనగర్‌లోని శిశు సంరక్షణ కేంద్రంలో "అమ్మా, నన్ను ఇంటికి తీసుకెళ్లు.. నాకు భయంగా ఉంది!" అంటూ బాలుడు తన పెంపుడు తల్లి సరితను చూసి ఏడుస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ ఘటన తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. చిన్నారి ఆవేదన ప్రతి ఒక్కరినీ కదిలించింది. జగిత్యాలకు చెందిన కాసారపు శ్రీనివాస్, సరిత దంపతులు సంతానం లేకపోవడంతో రుద్ర మహేశ్‌ను ఐదు రోజుల పసికందుగా ఉన్నప్పటి నుంచి పెంచుకుంటున్నారు. హిందూ సంప్రదాయం ప్రకారమే తాము దత్తత తీసుకున్నామని వారు చెబుతున్నారు. అయితే, ఈ దత్తతకు చట్టబద్ధత లేదని అధికారులు బాలుడిని వారి నుంచి వేరుచేసి కరీంనగర్‌లోని ప్రభుత్వ శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. దీంతో బాలుడి కస్టడీ కోసం శ్రీనివాస్, సరిత దంపతులు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.



వారి వాదనలు విన్న న్యాయస్థానం, జ్యూ. నెం. 31588/2026లో అక్టోబర్ 16న బాలుడి మధ్యంతర కస్టడీని తిరిగి వారికే అప్పగించాలని ఆదేశాలు జారీ చేసింది. అక్టోబర్ 28న కోర్టు ఉత్తర్వులను శిశు సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ)కి సమర్పించినా, అప్పగింతలో జాప్యం జరిగిందని దంపతులు ఆరోపించారు. ఈ జాప్యంపై వారు నిన్న జగిత్యాల కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై స్పందించిన జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, హైకోర్టు ఆదేశాల ప్రకారమే బాలుడిని అప్పగిస్తామని హామీ ఇచ్చారు. సీడబ్ల్యూసీ ఆమోదం, పరిపాలనాపరమైన లాంఛనాల కారణంగానే జాప్యం జరిగిందని, సోమవారం రాత్రి లేదా మంగళవారం ఉదయానికల్లా ప్రక్రియ పూర్తి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. కలెక్టర్ హామీ ఇచ్చిన కొద్ది గంటల్లోనే సోమవారం సాయంత్రం అధికారులు బాలుడిని శ్రీనివాస్, సరిత దంపతులకు అప్పగించారు. తాను ఎవరి వద్దకు వెళ్లాలని ఆరాటపడ్డాడో ఆ తల్లిదండ్రుల చేతుల్లోకి రుద్ర మహేశ్ చేరడంతో ఈ కథ సుఖాంతమైంది.

పీపుల్స్‌డైరీ
వరంగల్
బుధవారం, 04 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 225

వ్యవసాయ మోటార్ సర్వీస్ వైర్లను ఎత్తుకెళ్లిన దొంగలు



కమలాపూర్ నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : కమలాపూర్ మండల పరిధిలోని శంభునిపల్లి గ్రామంలో రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు వ్యవసాయం బావుల వద్ద మోటార్లకు బిగించిన కరెంటు సర్వీస్ వైర్లను కట్ చేసి ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు. రైతులు పంట పొలాలకు నీరు అందివ్వడం కోసం వాగుపై ఉన్న చెక్ డ్యామ్ దగ్గర మోటార్లు అమర్చి పంట పొలాలకు నీరు అందిస్తున్నామని అన్నారు. కరెంటు స్తంభం నుండి సర్వీస్ వైరు ఇంజన్ మోటార్లకు దాదాపు 20 నుండి 30 మీటర్ల వరకు సర్వీస్ వైర్లు అవసరం ఉంటుందని అన్నారు. సుమారు 10 మంది రైతులు గువ్వాడి అశోక్, పెండ్యాల బుచ్చిరెడ్డి, కట్కూరి అశోక్ రెడ్డి , గువ్వాడి మొగిలి, గువ్వాడ శివాజీ, పెండ్యాల తిరుపతి రెడ్డి, బిల్ల ఉమా రెడ్డి, కొమురయ్య, గువ్వాడి నాగరాజు మోటార్ సర్వీస్ వైర్లు దొంగలించబడ్డాయని దీనివల్ల రైతులు ఒక్కొక్కరు రూ.20,000 రూపాయలు నష్టపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుని రైతులకు నష్టపరిహారం అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

ఆపదలో ఆదుకున్న ఆపన్నహస్తం

ఆరెపల్లి వేణు కుటుంబానికి కొండి పాముల సుహాసిని అండ



సైదాపూర్ , నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ, మానవత్వంతో సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. హనుమకొండ జిల్లా భీమాదేవరపల్లి మండలం వంగర గ్రామానికి చెందిన మేఘన ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు కొండి పాముల సుహాసిని మానవతా దృక్పథంతో ముందుకొచ్చి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆరెపల్లి వేణు కుటుంబానికి అండగా నిలిచారు. బాధలో ఉన్న ఆ కుటుంబాన్ని పరామర్శించడంతో పాటు నిత్యావసర సరుకులు, ఆర్థిక సహాయం అందించి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. అమ్మనగుర్తి గ్రామానికి చెందిన ఆరెపల్లి వేణు అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న వ్యక్తిని కోల్పోవడంతో వారు తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న మేఘన ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు కొండి పాముల సుహాసిని వేణు కుటుంబానికి తన వంతు సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం అరెపల్లి వేణు నివాసానికి వెళ్లిన సుహాసిని, తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. వేణు ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. అరెపెల్లి వేణు కుటుంబానికి అండగా నిలిచేందుకు సుహాసిని 30 కిలోల బియ్యంతో పాటు రూ.2,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కుటుంబానికి అవసరమైన సమయంలో చిన్న సహాయమైనా ఎంతో ఉపయోగపడుతుందనే ఉద్దేశంతో ఈ సాయం చేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలవడం, తమకు చేతనైనంత సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఈ సందర్భంగా ఆమె సేవా భావాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో తమ కుటుంబాన్ని పరామర్శించి, నిత్యావసర సరుకులతో పాటు ఆర్థిక సహాయం అందించిన సుహాసినికి అరెపెల్లి వేణు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె చూపిన మానవత్వం తమకు ఎంతో ఊరటనిచ్చిందని పేర్కొన్నారు. మృతుడి కుటుంబానికి మేఘన ఉమెన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు కొండి పాముల సుహాసిని అందించిన సహాయంపై గ్రామస్తులు అభినందనలు వ్యక్తం చేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, బాధిత కుటుంబాలకు భరోసా కల్పించడం సమాజంలో మానవతా విలువలను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి అండగా నిలుస్తున్న సుహాసిని ప్రయత్నాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుడు అరెపెల్లి రవీందర్, గ్రామ నాయకులు, బంధువులు కండె సునీత తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాల భూములను అమ్మితే సహించేది లేదు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి, నవంబర్ 03 : కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమినిటీస్ స్థలాలను ఖాళీ స్థలాల పేరుతో బహిరంగ వేలం ద్వారా విక్రయించడం సరికాదని, వెంటనే వేలం ప్రక్రియను ఉపసంహరించుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. హౌసింగ్ బోర్డు అధికారుల తీరు చూస్తుంటే రాబోయే రోజుల్లో పార్కు స్థలాలను కూడా మిగల్చేలా లేరని ఆందోళన వ్యక్తం చేశారు.లక్షలాది మంది నివాసం ఉంటున్న కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో కనీసం ఒక్క పెట్రోల్ బంక్ కూడా లేదని, పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం లేఅవుట్‌లో కేటాయించిన భూములను సైతం వేలానికి పెట్టడం అధికారుల బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. జేఎన్టీయూ--హైటెక్ సిటీ రోడ్డులోని ఫోరమ్ మాల్ చౌరస్తా వద్ద ఉన్న 2,500 గజాల స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, దానిని కమర్షియల్ ప్లాట్ పేరుతో వేలం వేసి విక్రయించేందుకు హౌసింగ్ బోర్డు అధికారులు చర్యలు తీసుకోవడం సరికాదన్నారు.మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ, హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమినిటీస్ స్థలాలను ఎట్టి పరిస్థితుల్లోనూ విక్రయించనివ్వబోమని, అవసరమైతే స్థానిక ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని స్పష్టం చేశారు. సుమారు యాభై ఏళ్ల క్రితం హౌసింగ్ బోర్డు లేఅవుట్ రూపొందించిన సమయంలో అప్పటి అవసరాలకు అనుగుణంగా ఎమినిటీస్ స్థలాలను కేటాయించారని, ప్రస్తుతం కాలనీ కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందడంతో ఆ స్థలాలు కూడా ప్రజల అవసరాలకు సరిపోవడం లేదని పేర్కొన్నారు.

రైతుల వ్యతిరేకిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

- రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్న నియోజకవర్గ ఎమ్మెల్యే
- తక్షణమే ఐకెపి సెంటర్లు ప్రారంభించాలని డిమాండ్ చేసిన కమలాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు



కమలాపూర్ నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : కమలాపూర్ మండలంలో గత పది రోజులుగా నెలకొన్న రైతు సమస్యలపై, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారుల స్పందన తీరుపై కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కమలాపూర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయలేక, గిట్టుబాటు ధర కల్పించలేక నానా ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు. ఆనాడు కేసీఆర్ ప్రభుత్వమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మేము డిమాండ్ చేసినా పట్టించుకోలేదని, నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతుల పక్షాన నిలబడి రైతులను రాజులను చేసే విధంగా పాలన అందిస్తోందని తెలిపారు. అయితే, స్థానికంగా ఉన్న అధికారులు మాత్రం ఐకేపీ కేంద్రాల ఏర్పాటు విషయంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. "నే వస్తా.. నేను వచ్చాక ఐకెపి సెంటర్ల ను ప్రారంభం చేస్తా" అప్పటిదాకా ఐకెపి సెంటర్లు పిఏసిఎస్ సెంటర్లను ప్రారంభించకూడదని అధికారులకు ఆదేశాలు ఇచ్చాడని అందుకోసమే ఈరోజు ప్రారంభించాల్సిన ఐకెపి సెంటర్లను ప్రారంభించకుండా ఆపడం జరిగిందని అధికారులు చెప్పడం జరిగింది. నియోజకవర్గ ఎమ్మెల్యే అయి ఉండి ప్రజల యొక్క సమస్యలకు పరిష్కారం చూపే మార్గం చేయకుండా అడ్డుపడడం సరైన పద్ధతి కాదని కమలాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. ప్రజలు నిన్ను ఎమ్మెల్యేగా ఎన్నుకున్నందుకు ఎంతో బాధ పడుతున్నారని ఇప్పటికైనా రైతుల పట్ల చిత్తశుద్ధితో మెదిలి ఐకెపి సెంటర్లను తక్షణమే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. కమలాపూర్ వ్యవసాయ మార్కెట్‌కు కూడా ధాన్యం తెచ్చిన రైతులు రోడ్లపై పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనాల కారణంగా అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా ఐకేపీ కేంద్రాలు తెరువకపోవడం స్థానిక ఎమ్మెల్యే ఇంకా అధికారుల వైఫల్యమేనని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే కేవలం నామమాత్రంగా గెలిచారే తప్ప, ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, గతంలో గ్యాస్ ధరలు, పప్పు ధాన్యాల ధరలు పెరిగినప్పుడు మాట్లాడని ఎమ్మెల్యే, నేడు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు మాని, తక్షణమే కమలాపూర్ నియోజకవర్గంలో ఐకేపీ కేంద్రాలను పూర్తిస్థాయిలో ప్రారంభించి రైతులను ఆదుకోవాలని ఈ సమావేశం ద్వారా నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో భాగంగా కమలాపూర్ మార్కెట్ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్ల రమేష్, జిల్లా సెక్రెటరీ ఆడెపు విజయ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మౌటం కుమారస్వామి, తౌటం రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ బాలసాని రమేష్, పోడేటి బిక్షపతి, చందుపట్ల నరసింహారెడ్డి, కమలాపూర్ ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చేరాల రోహిత్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెరిపెల్లి రామచందర్, చిలువేరు రవి, పల్లె సమ్మిరెడ్డి, సయ్యద్ అంకుస్, పెరుమండ్ల పరశురాములు, పుల్ల శోభన్ బాబు, గంధసిరి అనిల్, మౌటం నాగరాజు, మాట్ల కళ్యాణ్ కుమార్, బండి వంశీ, ఎల్కటి అనిల్, కిన్నెర రమేష్, మౌటం చిరంజీవి, బండి రాజేష్, సారంగపాణి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులు పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్...

భూపాలపల్లి నవంబర్ 3 పీపుల్స్ డైరీ.. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య చికిత్స అందించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్, రహవీర్ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, సూచించారు. ప్రధానమంత్రి రాహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో కిరణ్ ఆసుపత్రి, యోధా ఆసుపత్రి, 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి, మహాదేవపూర్, చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రులు కలిపి మొత్తం ఐదు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా, రోడ్డు ప్రమాద బాధితులను ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రోత్సాహకం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రహవీర్ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ఒక్కో ప్రమాద ఘటనకు రూ.25 వేల నగదు ప్రోత్సాహకం అందజేయడంతో పాటు, దేశవ్యాప్తంగా ప్రతిఏటా అత్యుత్తమ సేవలు అందించిన పది మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జాతీయ స్థాయి అవార్డులు అందజేస్తారని వివరించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయాలని, క్షతగాత్రులను సమీపంలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని ఎస్పీ సూచించారు. ప్రమాద బాధితులను చూసి నిర్లక్ష్యం చేయకుండా మానవతా దృక్పథంతో స్పందించి, సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని పేర్కొన్నారు.ప్రధానమంత్రి రాహత్, రహవీర్ పథకాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం



చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ కోరారు.

సూసైడ్ నోట్ రాసి తెలంగాణ ఉద్యమకారుడి బలవన్మరణం

- ఉద్యమం చేసి బతుకు ఆగం చేసుకున్నా..
- జనగామ జిల్లాలో తెలంగాణ ఉద్యమకారుడి ఆత్మహత్య
- అప్పుల బాధతోనే బలవన్మరణం అంటున్న కుటుంబ సభ్యులు
- సెల్ ఫోన్‌లో సూసైడ్ నోట్ రాసి ఉరివేసుకున్న లక్ష్మణ్ గౌడ్
- ఉద్యమకారుల బతుకులు మారలేదని నోట్‌లో ఆవేదన
- మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఓ కార్యకర్త

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన జనగామ జిల్లాలో చోటుచేసుకుంది. బచ్చన్నపేట మండలం కొన్నె గ్రామానికి చెందిన వేముల లక్ష్మణ్ గౌడ్ (40), సోమవారం ఓ వ్యవసాయ క్షేత్రంలో చెట్టుకు ఉరివేసుకుని కనిపించారు. ఆయన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్‌గా కూడా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మణ్ గౌడ్ తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో చేసిన అప్పులకు తోడు, ఇటీవలి కాలంలో పంట నష్టాలు రావడంతో ఆయన అప్పుల ఊబిలో కూరుకుపోయారు. ఆయనకు నాలుగు ఎకరాల సొంత భూమి ఉండగా, మరో ఆరు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. అయితే, పంటలు నష్టపోవడంతో బంధువులు, ప్రైవేట్ ఫైనాన్షియర్ల నుంచి అప్పులు తీర్చాలంటూ ఒత్తిడి పెరిగింది. ఈ రుణభారంతోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నారని భార్య స్వప్న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆత్మహత్యకు ముందు లక్ష్మణ్ గౌడ్ తన సెల్ ఫోన్‌లో ఒక నోట్ రాశారు. "తండ్రి కష్టపడి చదివిస్తే, ఉద్యమంలో పాల్గొని జీవితాన్ని పాడుచేసుకున్నాను. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమకారుల బతుకులు మారలేదు" అని అందులో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన భార్య, ఇద్దరు పిల్లలకు క్షమాపణలు చెప్పారు.లక్ష్మణ్ గౌడ్ విద్యార్థి దశ నుంచే టీఆర్ఎస్ (ప్రస్తుత బీఆర్ఎస్) యువజన విభాగంలో పనిచేసి, ఆ తర్వాత జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్ర సాధన కోసం పోరాడిన వ్యక్తి ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంపై స్థానికులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

హైదరాబాద్ శివార్లలో అక్రమ బోర్లను టార్గెట్ చేసిన హైడ్రా

- అక్రమ బోర్లపై హైడ్రా ప్రత్యేక దృష్టి
- సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో 7 బోర్లు, 6 వాటర్ సంపుల ధ్వంసం
- అనుమతులు లేని భూగర్భ జలాల వాణిజ్య వినియోగంపై ఉక్కుపాదం
- ట్యాంకర్ల వేగానికి చెక్ పడటంతో హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



హైదరాబాద్, దాని శివారు ప్రాంతాల్లో అక్రమంగా భూగర్భ జలాలను తోడేస్తూ సాగిస్తున్న నీటి వ్యాపారంపై హైడ్రా (న్‌ణ=ూూూ) ఉక్కుపాదం మోపుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా బోర్లు వేసి, నీటిని ట్యాంకర్ల ద్వారా అమ్ముకుంటున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా, సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం భారీ ఆపరేషన్ చేపట్టింది. ఈ ఆపరేషన్‌లో భాగంగా తెల్లాపూర్‌లోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో 7 అక్రమ బోర్‌వెల్‌లను పైపులతో సహా తొలగించి, వాటిని పూర్తిగా పూడ్చివేసింది. అలాగే, నీటి నిల్వ కోసం నిర్మించిన 6 భారీ వాటర్ సంపులను కూడా అధికారులు ధ్వంసం చేశారు. నీటి రవాణాకు ఉపయోగిస్తున్న ట్యాంకర్లను సీజ్ చేసి, సంబంధిత యజమానులపై కేసులు నమోదు చేశారు. భూగర్భ జలాలు అడుగంటిపోకుండా కాపాడటంతో పాటు, స్థానిక ప్రజలకు నీటి కొరత ఏర్పడకుండా చూసేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. గత కొంతకాలంగా నీటి ట్యాంకర్లు అతివేగంగా, నిర్లక్ష్యంగా ప్రయాణిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయని, తమ ప్రాణాలకు భద్రత లేకుండా పోయిందని పలు కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీల వాసులు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో హైడ్రా ఈ చర్యలకు ఉపక్రమించింది. హైడ్రా తీసుకుంటున్న చర్యలతో తమకు ప్రాణభయం తప్పిందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువులు, కుంటల సమీపంలో జరుగుతున్న అక్రమ నీటి దందాను పూర్తిగా అరికట్టాలని వారు కోరుతున్నారు. అనుమతులు లేని బోర్లపై నిఘా కొనసాగిస్తామని, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు.



విబి - జి రామ్ జి పనులను పరిశీలించిన డిఆర్‌డిఓ

మొగుళ్ళపల్లి, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మండలంలోని ఇస్సిపేట, ముల్కలపల్లి గ్రామాలలో డిఆర్ డిఓ బాలకృష్ణ పర్యటించి విబి – జి రామ్ జి పనులైన ఫీడర్, కాలువ పని, పూడిక తీత పనులను పరిశీలించిన డి ఆర్ డి ఓ. అనంతరం పనికి హాజరైన కూలీలతో మాట్లాడారు. ఎలినినో ప్రభావం ఉన్నందున గ్రామంలలో విబి – జి రామ్ జి నిధులను కూలీలు సమర్థవంతంగా వాడుకొనేవిధంగా కూలీలకు అవగాహనా కల్పించాలని, భూగర్భ జలాలను పెంచే విధంగా జలసిరి కార్యక్రమంలో పనులను గ్రామాలలో గుర్తించి పనులను చేయించాలని, కూలీలకు 125 రోజుల పని దినాలను కల్పించాలని, మండల అభివృద్ధి అధికారులకు డిఆర్డిఓ సూచించారు. అనంతరం మొగుళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సురేందర్, ఇసిపేట ములకలపల్లి గ్రామాల సర్పంచులు. యార ముకుంద రెడ్డి, గాధం శ్రీవాని రమేష్, ఏపీవో మాధవి, ఈసీ రాము, టిఏ. నిరంజన్, పంచాయతీ కార్యదర్శులు దివ్య, శరత్, ఫీల్డ్ అసిస్టెంట్స్ అజయ్, స్వరూప పాల్గొన్నారు.

ఓటు నమోదుపై బీఆర్ఎస్ నాయకుల అవగాహన



ఆత్మకూర్, నవంబర్ 3(పీపుల్స్ డైరీ) : గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సూచించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం మల్కపేట గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. సమన్వయ సభ్యుడు సావురే రాజేశ్వర్‌రావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు జిల్లెల కొమరయ్య, మాజీ సర్పంచి మాడిశెట్టి వేణుగోపాల్, క్లస్టర్ ఇన్‌చార్జి కలకోట్ల రాజేష్ ఆధ్వర్యంలో పట్టభద్రులను కలిసి వివరాలు సేకరించారు. అర్హులైన వారందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల ఓటు ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి మాధం శ్రావణ్, నాయకులు అంకతి బాబు, రవి, రాంచందర్, కుమార్, జగన్, పరమేష్, రమేష్, మధు, అయిలయ్య, కొమురయ్య, రాజు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని సందర్శించిన డీఈఓ



దుగ్గొండి, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : దుగ్గొండి మండలం మల్లంపల్లిలో మూడవ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి సందర్శించారు. ఈ కాంప్లెక్స్ సమావేశాన్ని ఉద్దేశించి ప్రతి విద్యార్థి తప్పకుండా చదవడం రాయడం వచ్చి ఉండాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులంతా తగిన విధంగా ప్రణాళికలు రచించుకొని విద్యార్థులకు తగిన విధంగా బోధించి సామర్థ్యాలు రాబట్టాలని ఆదేశించడం జరిగింది ఈ కాంప్లెక్స్ సమావేశంలో మండలంలోని ప్రతి పాఠశాల నుండి 50% ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ కాంప్లెక్స్ సమావేశాల్లో ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి ఎస్ వెంకటేశ్వర్లు హాజరు కాగా కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు ఏ రామస్వామి, భార్గవి, జ్యోతిలక్ష్మి నిర్వహించడం జరిగింది ఇందులో రిసోర్స్ పర్సన్స్ గా శ్రీవిద్య ,సాంబయ్య, సతీష్ వ్యవహరించారు. అలాగే ఈ కాంప్లెక్స్ సమావేశాలను ఉద్దేశించి జిల్లా ఎఫ్ ఎల్ ఎన్ నోడల్ అధికారి బాలవద్దిరాజు పాల్గొని విద్యార్థులకు సామర్థ్యాలు రావడంలో ఉపాధ్యాయుల అవలంబించాల్సిన వ్యూహాన్ని విశదీకరించారు.

నర్సంపేట మున్సిపల్ కమిషనర్‌గా కె.నరేష్ రెడ్డి



నర్సంపేట, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : నర్సంపేట మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా కె.నరేష్ రెడ్డిని నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన శాఖ కమిషనర్ డైరెక్టర్ (సీడీఎంఏ) డాక్టర్ టి.కె. శ్రీదేవి సోమవారం ప్రొసీడింగ్స్ జారీ చేశారు. నరేష్ రెడ్డికి నర్సంపేట మున్సిపల్ కమిషనర్ పోస్టుకు సంబంధించి పూర్తి అదనపు బాధ్యతలను (ఎఫ్ఏసీ) అప్పగించారు. ప్రస్తుతం నరేష్ రెడ్డి, డిప్యూటేషన్ ప్రాతిపదికన మరిపెడ మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు.నియామకానికి సంబంధించిన కాపీలను వరంగల్ జిల్లా కలెక్టర్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్, ఆర్‌డీఎంఏ తదితర అధికారులకు సమాచారం నిమిత్తం పంపినట్లు సీడీఎంఏ కార్యాలయం తెలిపింది.

మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

మడికొండ, మెట్టుగుట్ట, ఇందిరానగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు పరిశీలించిన గ్రేటర్ కమిషనర్

మట్టెవాడ, నవంబర్ 03 (పీపుల్స్ డైరీ) : నగర ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనర్ ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులతో కలిసి గ్రేటర్ వరంగల్ పరిధిలోని మడికొండ, మెట్టుగుట్ట, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి మంచినీటి పైప్‌లైన్లు, నీటి సరఫరా వ్యవస్థ, పారిశుద్ధ్య నిర్వహణ, వివిధ అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా ముందుగా మడికొండలోని బాలాజీనగర్ వాటర్ ట్యాంక్ నుంచి మెట్టుగుట్ట వరకు ఏర్పాటు చేసిన మంచినీటి పైప్‌లైన్‌ను పరిశీలించి నీటి సరఫరా వ్యవస్థ పనితీరును సమీక్షించారు. ప్రజలకు



ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా మంచినీటిని సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. మడికొండ ప్రాంతంలోని వివిధ కాలనీలలో నిర్మించిన సీసీ రోడ్లను పరిశీలించి, పనుల నాణ్యతను పరిశీలించారు. అనంతరం ఇందిరమ్మ కాలనీ సమీపంలోని శ్మశాన వాటికను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం మడికొండ, రాంపూర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ తీరును కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ రాజ్‌కుమార్, చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రాజారెడ్డి, ఇంజనీర్ రవికుమార్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగపేట నూతన ఎస్ఐ కలిసిన పెసా కమిటీ ప్రతినిధులు

గిరిజన హక్కులు, సంప్రదాయాలు, సంస్కృతులను కాపాడాలని వినతి

మంగపేట, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మంగపేట షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ)ను పెసా కమిటీ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతంలో విధి నిర్వహణ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఐదో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలులో ఉన్న పెసా చట్టం–1996 ప్రకారం గ్రామ సభలకు, స్థానిక గిరిజన కమిటీలకు ఉన్న ప్రత్యేక అధికారాలు, హక్కులను ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు స్థానిక ఆచారాలు, సంప్రదాయాలు, సంస్కృతులకు ఎలాంటి భంగం కలగకుండా చూడాలని కోరారు. అనంతరం పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఎస్ఐకి అందజే శారు. గిరిజన గ్రామాల్లో వివాదాలు, సమస్యలు తలెత్తినప్పుడు చట్టప్రకారం గ్రామసభలు లేదా పెసా కమిటీల సమక్షంలో పరిష్కారానికి పోలీసు శాఖ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ గ్రామాల్లో నాటుసారా విక్రయాలు, బెల్ట్ షాపులు, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను



అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై నూతన ఎస్ఐ సానుకూలంగా స్పందిస్తూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించాలని కోరినట్లు పెసా మండల అధ్యక్షులు జోగా నరేందర్ తెలిపారు. చట్టపరిధిలో గిరిజన ప్రాంతాల హక్కులను గౌరవిస్తూ, బాధితులకు తక్షణ న్యాయం జరిగేలా నిష్పక్షపాతంగా సేవలందిస్తామని ఎస్ఐ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెసా మండల ఉపాధ్యక్షులు మడి శోభన్ బాబు, ప్రధాన కార్యదర్శి పాయం రమేష్, కోశాధికారి తాటి విజయ్ బాబు, పెసా ములుగు జిల్లా అధ్యక్షులు దబ్బుల ముత్యాల రావు, పుసం కార్తిక్, జబ్బా కర్నాకర్, చౌలం సాయి బాబు, యాలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భద్రకాళి సన్నిధిలో ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బ్రహ్మశ్రీ చాగంటి

పూర్ణకుంభ స్వాగతం పలికిన అర్చకులు

మట్టెవాడ, నవంబర్ 03 (పీపుల్స్ డైరీ) : వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం ఉదయం ఉదయం ఆధ్యాత్మికవేత్త ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వర రావు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన కోటేశ్వర రావుకి ఆలయ చైర్మన్ డాక్టర్ బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, మయూరి రామేశ్వర్‌రావు, కమటం వేణుగోపాల్, మాడిశెట్టి సతీష్, కల్లూరి పవన్ కుమార్, చిదురాల అంజనీదేవి, పేరాల శ్రీనివాస రావు, రమేష్ చంద్ భంగ్, డాక్టర్ వాసవీ రెడ్డి, ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషులు పూర్ణకుంభం తో, వేదస్వస్తితో ఘనస్వాగతం పలికారు. ముందుగా గోకులంలో గోప్రదక్షిణ చేసి అనంతరం శ్రీ వల్లభ గణపతిని దర్శించిన తర్వాత అమ్మవారి ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. పూజానంతరం ఆలయ మహా మండపంలో అర్చకులు, వేదపండితులు మహదాశీర్వ





చనం నిర్వహించిన తదుపరి భక్తులను ఉద్దేశ్యించి బ్రహ్మశ్రీ చాగంటి ప్రవచనం జరిపారు. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావుని చూసేందుకు, వారి ప్రవచనం ఆలకించేందుకు వంద లాది భక్తులు ఆలయా నికి చేరుకున్నారు. వారి వెంట విద్యారణ్య ఆర్ష ధర్మ రక్షణ సంస్థ ప్రతినిధులు ఆలయాన్ని సందర్శించారు.





భద్రకాళి సన్నిధిలో ఐపఎస్ అధికారి వాసం

మట్టెవాడ, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానాన్ని మంగళవారం ఉదయం ఐఏఎస్ అధికారి వాసం వెంకటేశ్వర్లు సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన వెంకటేశ్వర్లుకి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింపచేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు భద్రకాళి శేషు, అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహుకరించి ప్రసాదములు అందచేశారు.



సీసీ రోడ్డు లేక బురదమయంగా మారిన దారి..

ఇబ్బందులు పడుతున్న రాజానపల్లి తండా ప్రజలు

గూడూరు, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం రాజానపల్లి తండాలో సీసీ రోడ్డు లేక గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.గ్రామంలోని ప్రధాన రహదారి సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షం నీరు నిలిచి బురదమయంగా మారింది. ఫోటోలో కనిపిస్తున్నట్లుగా రోడ్డుపై భారీగా నీరు నిలిచి, బురదతో నిండిపోవడంతో వాహనదారులు, పాదచారులు నడవలేని పరిస్థితి నెలకొంది. పిల్లలు స్కూలుకు వెళ్లాలన్నా, వృద్ధులు బయటకు రావాలన్నా ఇబ్బందిగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చిన్నపాటి వర్షానికే రోడ్డు చెరువును తలపిస్తోందని, మురుగు నీరు పారుదల లేక మరింత దుర్గంధంగా మారిందని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తమ తండాకు సీసీ రోడ్డు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం!

అరాచక శక్తులను తరిమికొడదాం!! - ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్ రెడ్డి



మట్టెవాడ, నవంబర్ 03 (పీపుల్స్ డైరీ) : వరంగల్ నగరంలోని కే కన్వెన్షన్ హాలులో "సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ" ఆధ్వర్యంలో మేధావుల సదస్సు నిర్వహించారు. ప్రముఖులు కుసుమ సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో "ప్రజాస్వామ్యాన్ని కాపాడుదాం – అరాచక శక్తులను తరిమికొడదాం", అనే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ కార్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలతో కూడిన కాంగ్రెస్ కూటమి దేశంలో అరాచక శక్తులను ప్రోత్సహిస్తూ, రాజ్యాంగ బద్ధమైన వ్యవస్థలపై బురదజల్లుతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేశంలో ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ చట్టప్రకారం సక్రమంగా పూర్తయిన తర్వాతనే కదా కర్ణాటక, కేరళ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. అక్కడ అధికారంలోకి వచ్చినప్పుడు సక్రమంగా అనిపించిన సవరణ ప్రక్రియ, ఇక్కడ తెలంగాణకు వచ్చేసరికి కాంగ్రెస్ కి ఎందుకు తప్పుగా కనిపిస్తోందని, అక్కడ లేని ప్రశ్నలు, అభ్యంతరాలు ఇక్కడ ఎందుకు లేవనెత్తుతున్నారని ఆయన గట్టిగా నిలదీశారు. రాహుల్, మల్లికార్జున్ కర్గే, రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ కూటమి అధికారంలోకి రావడానికి ఒకలా, అధికారంలో ఉన్నప్పుడు మరొకలా ప్రవర్తిస్తూ ద్వంద్వ ప్రమాణాలను అవలంబిస్తోందని ప్రముఖ న్యాయవాది కొండపల్లి శ్రీధర్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శించారు. ఓటర్ల జాబితాలో ఏవైనా సమస్యలు ఉంటే క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండే బూత్ లెవెల్ ఆఫీసర్‌ను సంప్రదించి చట్టప్రకారం పరిష్కరించుకోవాలనే కనీస అవగాహన లేకుండా, ప్రతి చిన్న విషయానికి ఢిల్లీకి వెళ్లి రాజకీయం చేయడం కాంగ్రెస్ కూటమి అరాచక వైఖరికి, వ్యవస్థలపై వారికి ఉన్న అగౌరవానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. నేటి ఆధునిక సమాజంలో ముఖ్యంగా జడ్ జెనరేషన్ యువతను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచకాలు, వికృత చేష్టలు పరాకాష్టకు చేరాయి. మేధావులు, విద్యావంతులు, చైతన్యవంతమైన యువత ఈ అరాచక శక్తుల వెనుక ఉన్న అసలు రంగును గుర్తించాలి. ఇలాంటి వికృత రాజకీయాలను తిప్పికొట్టి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన సమయం ఆసన్నమైందనీ శ్రీధర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వరంగల్ నగరానికి చెందిన పలువురు మేధావులు, న్యాయవాదులు, విద్యాసంస్థల ప్రతినిధులు, ప్రజాస్వామ్యవాదులు పాల్గొని సదస్సులో అంశాలపై చర్చించి విజయవంతం చేశారు.

వృథాగా పారుతున్న మిషన్ భగీరథ నీళ్లు

అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం

కేసముద్రం, నవంబర్ 3 (పీపు ల్స్ డైరీ): ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొని, భూగర్భ జలాలు అడుగంటి తాగునీటి ఎద్దడి తలెత్తే ప్రమాదం ఉందని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేస్తున్న వేళ.. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ శివారులో మాత్రం మిషన్ భగీరథ నీళ్లు యథేచ్ఛగా వృథాగా పోతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఫోటోనే నిదర్శనం.జిల్లాలోని పలు ప్రాంతాల్లో మిషన్ భగీరథ పైప్ లైన్లు లీకేజీలకు గురై పగిలిపోయాయి. రోడ్డు పక్కన వేసిన పైపు నుండి ఉధృతంగా నీరు బయటకు వచ్చి రోడ్డుపైకి పారుతోంది. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా, మరమ్మతులు చేయడంలో మిషన్ భగీరథ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టింది. కానీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ



లోపం, పైప్ లైన్ల నాణ్యత లోపంతో నీరు ఇలా వృథా కావడం ప్రజలను ఆందోళనకు గురి చేస్తోంది. ఒకవైపు గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు బిందెలు పట్టుకుని తిరుగుతుంటే, మరోవైపు ఇలా వేల లీటర్ల నీరు వృథాగా పోవడం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తు న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని అరికట్టి, పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టాలని, నీటి వృథాను అరికట్టాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
బుధవారం, 4 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 222



ఎస్సై మధుకర్‌కు బీఆర్ఎస్ శ్రేణుల ఘన స్వాగతం

ములుగు జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తాటి కృష్ణ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం

మంగపేట, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : ములుగు జిల్లా మంగపేట పోలీస్ స్టేషన్‌లో నూతన సబ్‌ఇన్‌స్పెక్టర్‌గా (ఎస్సై) బాధ్యతలు చేపట్టేందుకు విచ్చేసిన మధుకర్‌కు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు జిల్లా సీనియర్ నాయకులు తాటి కృష్ణ ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో నూతన ఎస్సై మధుకర్‌కు పూలమాలలు వేసి, శాలువా కప్పి, మిఠాయిలు తినిపించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మంగపేట మండలానికి సమర్థవంతమైన అధికారి రావడం సంతోషకరమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ బాధితులకు న్యాయం చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన ఎస్సై మధుకర్ మాట్లాడుతూ మంగపేటలో బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని, బీఆర్ఎస్ నాయకులు ఇంతటి ఆత్మీయ స్వాగతం పలకడం సంతోషం కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు: బీఆర్ఎస్ జిల్లా నాయకులు తాటి కృష్ణ, ఎండీ యూనస్, చిట్టిమల్ల సమ్మయ్య, నూనె లింగయ్య, తుక్కాని శ్రీనివాస్, పబ్బోజు సత్యనారాయణ చారి, ఎండీ అయూబ్, ఎలవర్తి శ్రీనివాస్, దంతనపల్లి నరేందర్, మల్‌రెడ్డి సుధాకర్ రెడ్డి, ఎండీ రాజాసాహెబ్, మూగల రమేష్, గాదె శ్రీనివాసచారి, మూగల రాము, సుంకోజు ప్రశాంత్, కొలుకుల దేవా, నిమ్మగడ్డ ప్రవీణ్, గోగులమూడి తంబి, గొడుగు నరేష్, దూలగొండ సాంబశివరావు, ఎర్ర వెంకటేష్, మంచాల నాగేంద్రబాబు, యాలం శ్రీను పాల్గొన్నారు.

ఎస్ఐ మధుకర్‌కు జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ సన్మానం



మంగపేట, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మంగపేట పోలీస్ స్టేషన్‌కు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ శ్రీ మధుకర్‌ను జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ -- మంగపేట ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ మంగపేట ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు నూతన ఎస్ఐ మధుకర్ తన విధులను సమర్థవంతంగా నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజలకు పోలీసులకు మధ్య సత్సంబంధాలు మరింత బలోపేతం కావాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో జ్వాలా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడెల నరేష్, ప్రధాన కార్యదర్శి బండపల్లి రవి గౌడ్, ఉపాధ్యక్షులు పుల్లం శెట్టి అజయ్, గంగుల చంటి, వై. విరన్ కుమార్, కార్యదర్శులు పున్నెం భాస్కర్, గోలి నరేష్, నిమ్మల నరేష్, కోశాధికారులు నూతలకంటి ఈశ్వర్ చందు, ప్రచార కార్యదర్శులు గగ్గూరి మహేష్, మహమ్మద్ ఖాజా పాషా, మామిల్ల నాగరాజు, గౌరవ సలహాదారులు కోలగట్ల నరేష్ రెడ్డి, చాదా మల్లయ్య, సిద్ధంశెట్టి కనకారావు, లిక్కి రమేష్, కార్యవర్గ సభ్యులు సాంబశివరావు, సతీష్, అనిల్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి ఆడబిడ్డ వివాహానికి ఆర్థిక చేయూత..

పెద్ద మనసు చాటుకున్న కాకులమర్రి దంపతులు



మంగపేట, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలవడమే నిజమైన మానవత్వమని నిరూపిస్తూ ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు, ఏటూరునాగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత దంపతులు మరోసారి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఏటూరునాగారానికి చెందిన ఎండీ అన్వర్ పాషా మేనకోడలి వివాహం ఆర్థిక ఇబ్బందుల మధ్య జరుగుతున్న విషయాన్ని తెలుసుకున్న కాకులమర్రి దంపతులు వెంటనే స్పందించారు. పేదింటి ఆడబిడ్డ వివాహానికి అండగా నిలుస్తూ రూ.15,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందిస్తూ, పేద కుటుంబాల కష్టాల్లో భాగస్వాములవుతున్న కాకులమర్రి దంపతుల సేవా గుణం అభినందనీయమని స్థానిక ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజాసేవే లక్ష్యంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించడం పట్ల పలువురు ప్రశంసలు కురిపించారు. ఈ కార్యక్రమంలో కాకులమర్రి ప్రదీప్ రావు, తాడూరి రఘు, ఉపసర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, ఎస్.కె. అమ్ములు బేగం బాబా, కుమ్మరి చంద్రబాబు, జాడి భోజరావు, పెద్దబోయిన బాలకృష్ణ, లంబడిగూడెం సర్పంచ్ పోరిక సరిత శ్రీనివాస్, ఆకునూరి యశ్వంత్, గంప కిరణ్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లింగయ్య మృతదేహానికి నివాళులర్పించిన నాయకులు

చిట్యాల, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన దాసారపు రవి మరియు కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దాసారపు సదానందం గార్ల తండ్రి లింగయ్య మంగళవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వివిధ రాజకీయ సామాజిక సంఘాల నాయకులు గర్మిళ్లపల్లిలోని ఆయన నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించా రు. అనంతరం లింగయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ కష్ట సమయంలో వారికి మనోధైర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి మాదిగ సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు కుర్రె మల్లన్న సీపీఐ (ఎంఎల్) జయశంకర్ భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు రామ్ రామచందర్ మాదిగ జిల్లా నాయకులు సోముల శ్రీనివాస్ మాదిగ గాజుల బిక్షపతి మాదిగ ఎమ్మార్పీఎస్ టేకుమట్ల మండల అధ్యక్షులు మచ్చ శ్రీకాంత్ మాదిగ ఎంఎస్పి మండల అధ్యక్షులు మాడుగుల వీరయ్య మాదిగ అక్కల భద్రయ్య ఇల్లందుల శంకర్ రేణిగుంట్ల శంకర్ ఈసంపెల్లి పోశాలు పాల శంకర్ మాదిగ ఈసంపెల్లి రాజయ్య మాదిగ పలువురు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొని నివాళులర్పించారు.



గవర్నర్ కోటా ఎమ్మెల్సీగా మహిళకు అవకాశం కల్పించాలి

బహుజన మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి - సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్



గణపురం, నవంబర్ 03 (పీపుల్స్ డైరీ) : గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ స్థానాల్లో మహిళలకు ప్రాధాన్యత కల్పించాలని సామాజిక న్యాయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆకుల సుభాష్ ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆయన అధ్యక్షతన సామాజిక న్యాయ వేదిక ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యేషబోయిన సాంబయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సాంబయ్య యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రకటిస్తూ, మహాలక్ష్మి పథకంతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళల మద్దతుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, రానున్న ఎమ్మెల్సీ నియామకాల్లోనూ మహిళలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. ముఖ్యంగా అత్యధిక జనాభా కలిగిన బహుజన వర్గాల మహిళలకు గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం ద్వారా సామాజిక న్యాయానికి పెద్దపీట వేసినట్లవుతుందన్నారు. మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంతో పాటు, బహుజన మహిళల గొంతుకకు చట్టసభల్లో స్థానం కల్పించాలని సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర కమిటీ తరఫున ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు. దామెరుప్పుల మధుస్వామి గౌడ, న్యాయ వేదిక రాష్ట్ర నాయకులు బూర రమేష్ గౌడ్, లంబాడి న్యాయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు దేవా నాయక్, బాణోతు రాజునాయక్ మల్యాల పెద్ద రవి మాదిగ, ముత్తోజు వీణాచారి, పసునూటి శంకర్, బత్తుల శ్రీధర్ యాదవ్, ఎస్ కుమార స్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పాఠశాల విద్యార్థి ఎంపిక



చిట్యాల, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు చిట్యాల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బానోతు శ్రీధర్ ఎంపికయ్యాడని మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బానోతు శ్రీధర్‌ను ప్రత్యేకంగా అభినందించి జాతీయస్థాయిలో కూడా గెలుపొందాలని ఆకాంక్షించారు. విద్యార్థి అభివృద్ధిలో క్రీడలు కీలకమని మాట్లాడారు. పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ సూదం సాంబమూర్తి మాట్లాడుతూ బానోతు శ్రీధర్ అథ్లెటిక్స్ లో ట్రయాథ్లాన్ విభాగంలో రన్నింగ్ లాంగ్ జంప్ షార్ట్ పుట్ క్రీడ అంశాలలో విశేష ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనందుకు చాలా ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 12 నుంచి 14 వరకు హైదరాబాదులో జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీరామ్ రఘుపతి మాట్లాడుతూ విద్యార్థి అభివృద్ధిలో క్రీడలు, చదువు దోదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ నేపాలి వేణు సింగ్, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బొమ్మ రాజమౌళి కూచనపల్లి శ్రీనివాస్ బుర్ర సదయ్య సాంబారు రామనారాయణ ఉస్మానాలి గడ్డం శంకర్ బిట్ల సరళాదేవి మంద నీలిమ రెడ్డి మోరిశెట్టి సుజాత మురారి కల్పన విజయలక్ష్మి తుమ్మ మౌనిక మహేందర్ తదితరులు శ్రీధర్ ను అభినందించారు.

కేటీఆర్‌ను కలిసిన రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షులు రాజ్ కుమార్



నర్సంపేట, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మాజీ మంత్రి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావును హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో వరంగల్ జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధుల బృందం మర్యాద పూర్వకంగా కలిసింది. కేటీఆర్‌ను కలిసిన వారిలో వరంగల్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు సానబోయిన రాజ్‌కుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు నాడెం శాంతి కుమార్, జిల్లా ఎంసీ సభ్యులు మోతే తిరుపతి రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ చేపడుతున్న పలు సామాజిక, సేవా కార్యక్రమాలను ప్రతినిధులు ఆయనకు వివరించారు.

సేవా దృక్పథంతో ముందుకు సాగాలి : కేటీఆర్

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ --- మానవత్వంతో చేసే సేవా కార్యక్రమాలకు రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ ముందుంటుందని కొనియాడారు. వరంగల్ జిల్లాలో రక్తదాన శిబిరాలు, అత్యవసర వైద్య సాయం, సామాజిక సేవల విస్తరణకు సొసైటీ నిర్వాహకులు మరింత ఉత్సాహంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో అత్యంత నిరుపేదలకు సాయం అందించడంలో రెడ్‌క్రాస్ పాత్ర ప్రశంసనీయమని ఆయన కొనియాడారు. ఈ భేటీలో పాల్గొన్న ప్రతినిధులను కేటీఆర్ అభినందించి, భవిష్యత్తులోనూ తమ సేవా కార్యక్రమాలను విజయవంతంగా కొనసాగించాలని ఆకాంక్షించారు.

కాకతీయ హైస్కూల్లో ఇంగ్లీష్ ఫెస్ట్



చిట్యాల, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్లో మంగళవా రం ఇంగ్లీష్ ఫెస్ట్ కార్యక్రమము నిర్వహించారు ఇంగ్లీష్ ప్రాముఖ్యతను విద్యార్థులు స్కిడ్ రూపంలో ప్రదర్శించారు. ముఖ్యంగా వాతావరణంలో వచ్చిన మార్పులతో రాబోయే రోజుల్లో ఎల్నీనో ప్రభావముతో కరెంటు ప్రాబ్లమ్ నీటి కొరత ఏర్పడుతుంది అనే అంశమును అలాగే సెల్‌ను తరచుగా విద్యార్థులు ఉపయోగించడం వలన చదువులో వారికి కలిగే ఆటంకములను నాటిక రూపంలో ప్రదర్శించి ఆటపాటలతో సమాజానికి మంచి సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ రాజ్ మహమ్మద్ పోటీలలో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ మహమ్మద్ ఆఫీస్ డైరెక్టర్ ఫర్వీన్ అజ్మీ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గణపురాన్ని కరువు మండలంగా ప్రకటించాలి : పూర్ణచంద్రారెడ్డి



గణపురం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మండలంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో గణపురం మండలాన్ని తక్షణమే కరువు మండలంగా ప్రకటించాలని మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం పడుతోందని, పంటల సాగు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని అధికారులు సమగ్రంగా పరిశీలించాలని కోరారు. రైతుల సంక్షే మం ప్రభుత్వ బాధ్యత అని, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న అన్నదా తలను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కరువు మండలంగా ప్రకటించడం లో జాప్యం జరిగితే రైతుల పక్షాన ఉద్యమం చేపడతామని పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి హెచ్చరించారు.

చెరువులో అక్రమ మట్టి తరలింపుపై చర్యలు తీసుకోవాలి



చిట్యాల, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : టేకుమట్ల మండలంలోని పంగిడిపల్లె గ్రామ శివారులో ఉన్న చెరువులో మట్టిని తీసిన వారిపై సంబంధిత అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేష్ ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రామ్ రాంచందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు టేకుమట్ల మండలం తహసీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పంగిడిపల్లె గ్రామ శివారులోని చెరువులో మట్టిని తీసి తరలించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు. చెరువులు గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరమైనవని వాటి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నా రు. చెరువులో మట్టిని అనుమతులు లేకుండా తీసినట్లయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మట్టి తవ్వకాలకు సంబంధించిన అనుమతులు అధికారుల పర్యవేక్షణపై విచారణ చేపట్టాలని అధికారులను కోరారు. ప్రభుత్వ చెరువుల పరిరక్షణకు అధికారులు ప్రత్యేక దృష్టి సారిం చాలని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని మల్లేష్ రాంచందర్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మండల కార్యదర్శి అంబాల అశ్వద్ధామ పాల్గొన్నారు.

ఆకాశంలో వింత కాంతులు

కేసముద్రం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని పూలే సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఆకాశంలో వింతగా కనిపించిన కాంతులు స్థానికులను ఆకట్టుకున్నాయి. సూర్యాస్తమయం సమయంలో మేఘాల మధ్య బంగారు వర్ణంలో మెరుస్తూ కనిపించిన ఈ దృశ్యాన్ని చూసి ప్రజలు ఆశ్చర్యపోయారు. మబ్బులన్నీ బంగారపు రంగులోకి మారి, ఆకాశం మొత్తం ఒక అద్భుతమైన చిత్రంలా కనిపించింది. క్షణంలో ఈ వింత కాంతిని చూసిన వాహనదారులు, స్థానికులు తమ సెల్ ఫోన్లలో ఫోటోలు, వీడియోలు తీసుకున్నారు. ప్రకృతి అందాలకు నిదర్శనంగా నిలిచిన ఈ దృశ్యం పూలే సెంటర్ రోడ్డులో ప్రయాణిస్తున్న వారికి కనువిందు చేసింది.



డిసెంబర్ 15 నుండి ఆశాలు నిరవధిక సమ్మె

నర్సంపేట, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించకుంటే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్నారని బిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు అన్నారు. మంగళవారం నర్సంపేట ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ బాంజీపేట మెడికల్ ఆఫీసర్లకు ఆశలతో కలిసి సమ్మె నోటీసు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు ఫిక్స్ వేతనంగా 18 వేల రూపాయలు ఇస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని చెప్పి మాట తప్పిందని పలుమార్లు ప్రభుత్వానికి తమ సమస్యల పరిష్కరించాలని విన్నవించిన చెవిటి వాడి ముందు శంఖం ఊదిన చందంగా ఉందని అందుకే డిసెంబర్ 15 నా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆశలు తాము చేస్తున్న విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిపి యూనిట్ అధ్యక్షురాలు సంధ్య బాంజీపేట పి.హెచ్.సి అధ్యక్షురాలు సునీత నాయకులు లలిత రమ సరోజన లత విజయ తదితరులు పాల్గొన్నారు.



పీఎం రాహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఉమ్మడి జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ విక్రమ్



చిట్యాల, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సత్వర వైద్య చికిత్స అందించి విలువైన ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ రహవీర్ పథకాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని బాధితులు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరోగ్యశ్రీ మేనేజర్ పమ్మి విక్రమ్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఆరోగ్యశ్రీ ఇన్చార్జి యామంకి అనిల్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ సందర్భంగా విక్రమ్ అనిల్ మాట్లాడుతూ ప్రధానమంత్రి రాహత్ పథకం కింద రోడ్డు ప్రమాద బాధితులకు గరిష్ఠంగా రూ. 1.50 లక్షల వరకు ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నట్లు తెలిపారు. ప్రమాద బాధితులకు క్యాష్ లెస్ చికిత్స అందించడం జరుగుతుందన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో కిరణ్ ఆసుపత్రి యోధా ఆసుపత్రి 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి మహాదేవపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి చిట్యాల మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి మొత్తం ఐదు గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. అదేవిధంగా రోడ్డు ప్రమాద బాధితులను ప్రమాదం జరిగిన మొదటి గంటలోనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడిన వారికి ప్రోత్సాహకం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం రహవీర్ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకం కింద అర్హులైన వారికి ఒక్కో ప్రమాద ఘటనకు రూ. 25 వేల నగదు ప్రోత్సాహకం అందజేయడంతో పాటు దేశవ్యాప్తంగా ప్రతిఏటా అత్యుత్తమ సేవలు అందించిన పది మందికి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జాతీయ స్థాయి అవార్డులు అందజేస్తారని వివరించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112 నంబర్‌కు ఫోన్ చేయాలని క్షతగాత్రులను సమీపంలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని వారు సూచించారు.

గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



చిట్యాల, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : భూపాలపల్లి నియోజకవర్గంలోని చిట్యాల మండలంలో సుమారు రూ. 2.14 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా చైన్పాక అందుకు తండా గిద్దెముత్తారం కాల్వపల్లి ఏలేటి రామయ్య పల్లి గ్రామాల్లో మహిళా సంఘ భవనాల నిర్మాణానికి బావుసింగ్ పల్లి పాశిగడ్డ తండా గ్రామాల్లో మహిళా సమైక్య భవనాలు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రామచంద్రాపురం గ్రామంలో అంగన్వాడీ భవనం మహిళా సమైక్య భవనం గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన నిర్వహించారు. చింతకుంట రాంపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ భవన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం మహిళా సాధికారతకు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. మహిళా సంఘాలకు సొంత భవనాలు చిన్నారులకు మెరుగైన అంగన్వాడీ వసతులు గ్రామ పాలనకు అవసరమైన గ్రామ పంచాయతీ భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు తీసుకురావడం లో నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో మండల తాసిల్దార్ వసంతారావు సర్పంచులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దబ్బెట అనిల్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మూకిరాల మధువంశీకృష్ణ మాజీ మండల అధ్యక్షులు గూట్ల తిరుపతి మాజీ జెడ్పిటిసి ఓరం సమ్మయ్య జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య మండల ప్రధాన కార్యదర్శి గడ్డం కొమురయ్య నాయకులు గుర్రపు తిరుపతి గౌడ్ బుర్ర శ్రీనివాస్ గౌడ్ బుర్ర లక్ష్మణ్ గౌడ్ గంగాధరి రవీందర్ గుర్రపు నర్సయ్య మహిళా సంఘాల ప్రతినిధులు అంగన్వాడీ సిబ్బంది గ్రామ పంచాయతీ అధికారులు స్థానిక నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడం మనందరి భాద్యత...



ఖమ్మం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : విధుల్లో ఉన్న మహిళా ఉద్యోగులకు రక్షణ కల్పించాల్సిన భాద్యత మనందరిపైన ఉందని వైద్యాధికారి ఐ.దేవిశ్రీ అన్నారు. మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం యుపీహెచ్సీ వెంకటేశ్వరనగర్ లొ బేటీ భచావో భేటీ పడావో కార్యక్రమం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని చేపడుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా మహిళలపట్ల సమాజం ప్రత్యేక శ్రద్ద పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మహిళలపైన జరుగున్న లైంగిక, మానసిక, వ్యక్తిగత దాడులని పూర్తిస్తాయిలో నిరోధించాలని లక్ష్యంగా పనిచేస్తున్నా మహిళాసాధికారత కేంద్రం సేవలను ఆమె కొనియాడారు. బాలికలను కాపాడటం, బాలికలను చదివించడం (బేటీ భచావో భేటీ పడావో) కార్యక్రమానికి ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మం మహిళా సాధికారత కేంద్రం జిల్లా కో-ఆర్డినేటర్ సమ్రీన్ ఆధ్వర్యంలో ప్రత్యేక నిపుణులు వాసంతి, ప్రమీల మాట్లాడుతూ... ఈ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. మహిళా ఉద్యోగులు, మహిళల గౌరవానికి భంగం కలిగే పరిస్థితులు ఉత్పన్నామైనా 181 నెంబర్ కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. మహిళల్లో అక్షరాశ్యత పెంచడం పురుషులతో సమానంగా పురోగతి సాధించేలా కృషిచేయడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని వివరించారు. అలాగే ప్రజల వద్దనుండి వచ్చిన ప్రతీ సమాచారం గొప్యంగా ఉంచడం జరుగుతుందని తమకార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలొ హెచ్ ఈ ఓ వీరన్న, సూపర్ వైజర్ జడ్ ఎస్ జయపాల్, సిస్టర్లు శారదా, రహీంబి, ప్రసన్న, సంధ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజా సంక్షేమమే మా ప్రభుత్వ ధ్యేయం

తిరుమలయపాలెం మండలంలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన



ఖమ్మం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ): ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ఇందుకనుగుణంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం తిరుమలయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. దమ్మాయిగూడెం లో నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని 187 మందికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, పలువురికి కళ్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. తెట్టెలపాడు - బీరోలు రోడ్డు నుంచి ఏలువారిగూడెం వరకు రూ. 2.59 కోట్లతో నిర్మించే బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఇదే గ్రామంలో ఎన్. ఉప్పలయ్య- మంగమ్మ లు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని మంత్రి ప్రారంభించారు. బీరోలు గ్రామంలో రూ. 48 లక్షలతో నిర్మించే తాగునీటి నిలువ ట్యాంక్ (ఓహెచ్ఎస్ఆర్) పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో.. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... మండలంలో మొదటి విడతలో 810 ఇందిరమ్మ ఇళ్లను కేటాయించామని, ఇందులో 700 పూర్తయ్యాయని, మిగతావి వివిధ దశలో ఉన్నట్లు తెలిపారు. పేదోడి సొంతింటి కలను సాకారం చేసేందుకు.. మూడు, నాలుగో విడతల్లో కూడా ఇళ్లను మంజూరు చేస్తామని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలపేతం చేసేందుకు తమ ప్రజా ప్రభుత్వంలో రూ. 73 వేల కోట్లను వడ్డీ లేని రుణాలు అందజేశామని అన్నారు. కుల, మతాలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, ఆత్మ కమిటీ పాలేరు నియోజకవర్గ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, సీనియర్ నాయకులు బెల్లం శ్రీనివాస్, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.

ప్రజా సేవకుడా.. లేక పీడించే యజమానా..?

చదివింది దోచుకోవడానికేనా..? ప్రభుత్వ అధికారుల తీరుపై సగటు జీవి ప్రశ్న!

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే ఎన్నో సంవత్సరాల కష్టం, నిరంతర చదువు, రాత్రింబగళ్లు నిద్రలేని పోరాటం, పోటీ పరీక్షలు, లక్షలాది రూపాయల ఖర్చు, తల్లిదండ్రుల ఆశలు, కుటుంబ సభ్యుల త్యాగాలు అవసరం. ఒక సాధారణ పేద కుటుంబంలో పుట్టిన బిడ్డ ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని తల్లిదండ్రులు ఎన్నో కలలు కంటారు. తమ రెక్కల కష్టంతో పిల్లలను చదివించి, ఉన్నత స్థానాలకు చేర్చి, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదగాలని ఆశిస్తారు. కానీ ఉద్యోగం సాధించిన తర్వాత కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు ప్రభుత్వ ఉద్యోగం సంపాదించేది ప్రజలకు సేవ చేయడానికా? లేక ప్రజల దగ్గర నుంచి లంచాలు వసూలు చేసి ఆస్తులు కూడబెట్టడానికా?

ఎక్కడ చూసినా అవినీతి ఆరోపణలు.. ఏసీబీ వలల్లో అధికారులు!

రాష్ట్రంలో ఎప్పటికప్పుడు అవినీతి నిరోధక శాఖ నిర్వహిస్తున్న దాడుల్లో లంచాలు తీసుకుంటూ పట్టుబడుతున్న కొంతమంది ప్రభుత్వ అధికారులు, ఉద్యోగుల ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ఒక పని చేయడానికి ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లిన సామాన్యుడిని నిబంధనల పేరుతో తిప్పించుకోవడం, ఫైల్ కదలాలంటే డబ్బులు అడగడం, ప్రజల అవసరాలను తమ ఆదాయ మార్గాలుగా మార్చుకోవడం వంటి ఆరోపణలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయి.

ప్రభుత్వ కార్యాలయంలో ప్రజల పని జరగాలంటే లంచం ఇవ్వాల్సిన పరిస్థితి ఎందుకు రావాలి?

ప్రభుత్వం ఇచ్చే జీతం సరిపోవడం లేదా? ఉద్యోగంలో చేరే ముందు చేసే ప్రమాణాలు కేవలం మాటలకే పరిమితమా? ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యతను మరిచి, అధికారాన్ని అడ్డం పెట్టుకొని అక్రమ సంపాదనకు పాల్పడటం ఏ రకమైన నీతి? ఇక్కడ ఒక విషయం స్పష్టంగా గుర్తించాలి. ప్రభుత్వ ఉద్యోగులందరూ అవినీతిపరులు కాదు. ఎంతోమంది నిజాయితీ గా, నిబద్ధతతో ప్రజలకు సేవ చేస్తున్నారు. అలాంటి ఉద్యోగులను సమాజం గౌరవించాలి. అయితే అవినీతికి పాల్పడే కొద్దిమంది వల్ల మొత్తం ప్రభుత్వ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం దెబ్బతినకూడదు.

తల్లిదండ్రుల చెమట చుక్కల విలువ తెలియదా?

ఒక పేద రైతు తన కొడుకును చదివించడానికి పొలంలో ఎండనక, వాననక కష్టపడతాడు. ఒక కూలీ తల్లి తన బిడ్డ భవిష్యత్తు కోసం ఇళ్లలో పనులు చేస్తుంది. తమ కడుపు కట్టుకొని పిల్లలకు మంచి చదువు చెప్పిస్తారు. అప్పులు చేసి ఫీజులు కడతారు. తమ జీవితంలోని సుఖాలను త్యాగం చేసి పిల్లలను ఉన్నత స్థానాలకు చేర్చాలని కలలు కంటారు.

వారి ఆశ ఒక్కటే!

"మా బిడ్డ బాగా చదువుకోవాలి.. మంచి ఉద్యోగం సంపాదించాలి.. సమాజంలో గౌరవంగా బతకాలి.. నలుగురికి సహాయం చేయాలి.. మా కష్టాలకు ఒక అర్థం రావాలి." కానీ ఆ బిడ్డ ఉద్యోగం సాధించిన తర్వాత తన తల్లిదండ్రుల కష్టాలను, తనకు విద్యను అందించిన సమాజాన్ని, తనపై నమ్మకం ఉంచిన ప్రజలను మరిచిపోతే ఎలా? అవినీతి ద్వారా సంపాదించే ప్రతి రూపాయి వెనుక ఒక పేదవాడి అవసరం, ఒక రైతు సమస్య, ఒక నిరుద్యోగి ఆశ, ఒక సామాన్య కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక భారం ఉండవచ్చనే విషయాన్ని గుర్తించాలి.

ప్రజాసేవా? లేక అధికార దుర్వినియోగమా?

ప్రభుత్వ ఉద్యోగం అనేది వ్యక్తిగత ఆస్తి కాదు. అది ప్రజల పన్నుల ద్వారా నడిచే ప్రభుత్వ వ్యవస్థలో ఒక బాధ్యతాయుతమైన స్థానం. ఉద్యోగులకు చెల్లించే జీతాలు కూడా ప్రజలు కష్టపడి సంపాదించి ప్రభుత్వానికి చెల్లించే పన్నుల నుంచే వస్తాయి. అంటే ప్రభుత్వ ఉద్యోగి ప్రజల డబ్బుతో జీతం తీసుకుంటూ, అదే ప్రజల దగ్గర లంచాలు అడగడం ఎంతటి దుర్మార్గం ఒక పేదవాడు తన భూమి సమస్య పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయానికి వెళ్తాడు. ఒక వృద్ధుడు తన పెన్షన్ కోసం కార్యాలయం చుట్టూ తిరుగుతాడు. ఒక విద్యార్థి సర్టిఫికెట్ కోసం రోజుల తరబడి వేచి చూస్తాడు. ఒక రైతు తన పంటకు సంబంధించిన పత్రం కోసం అధికారుల చుట్టూ తిరుగుతాడు. ఇలాంటి సమయంలో వారికి సహాయం చేయాల్సిన అధికారి డబ్బులు అడిగితే ఆ సామాన్యుడు ఎవరిని ఆశ్రయించాలి? ప్రజాస్వామ్యంలో అధికారం ప్రజల నుంచి వస్తుంది. ఆ అధికారాన్ని ప్రజల ప్రయోజనాల కోసం వినియోగించాలి కానీ వ్యక్తిగత సంపాదన కోసం కాదు.

దోపిడీ చేయడానికి కూడా ఇంత కష్టపడి చదవాలా?

ఒక ప్రభుత్వ ఉద్యోగం కోసం నిరుద్యోగ యువత సంవత్సరాల తరబడి చదువుతున్నారు. ఎన్నో పోటీ పరీక్షలు రాస్తున్నారు. ఉద్యోగం రాకపోతే నిరాశకు గురవుతున్నారు. కొందరు వయోపరిమితి దాటిపోతున్నారు. మరికొందరు కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ కలలను వదులుకుంటున్నారు. అలాంటి పరిస్థితుల్లో ఉద్యోగం సాధించిన వ్యక్తి సమాజానికి ఆదర్శంగా నిలవాలి. కానీ కొందరు ఉద్యోగంలో చేరిన తర్వాత అక్రమ సంపాదనకు అలవాటు పడితే వారి చదువుకు, వారి ప్రతిభకు, వారి ఉద్యోగానికి ఉన్న విలువ ఏమిటి? విద్య మనిషికి విజ్ఞానాన్ని ఇవ్వాలి. విజ్ఞానం సమాజం పట్ల బాధ్యతను పెంచాలి. ఉద్యోగం మనిషికి ఆర్థిక భద్రతతో పాటు సామాజిక బాధ్యతను గుర్తు చేయాలి. కానీ విద్యను కేవలం డబ్బు సంపాదించే సాధనంగా, ఉద్యోగాన్ని అక్రమ ఆస్తులు కూడబెట్టే అవకాశంగా భావిస్తే అలాంటి విద్య వల్ల సమాజానికి ప్రయోజనం ఏమిటి? దోపిడీ చేయడానికి చదువు అవసరం లేదు.. ప్రజలకు సేవ చేయడానికి మాత్రం మానవత్వం, నైతిక విలువలు, సామాజిక బాధ్యత అవసరం!

ఉద్యోగులకు బాధ్యత ఉండాలి.. ప్రభుత్వానికి జవాబుదారీతనం ఉండాలి!

ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకమైన పరిపాలన ఉండాలి. ప్రతి పనికి నిర్ణీత కాలపరిమితి ఉండాలి. ప్రజలు తమ పని కోసం అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలి. లంచం అడిగే అధికారులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. ఆదాయానికి మించిన ఆస్తులపై సమర్థవంతమైన విచారణ జరగాలి. అవినీతి నిరోధక శాఖకు ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తగిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో నిజాయితీగా పనిచేసే ఉద్యోగులను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ప్రజలకు సేవ చేసే అధికారులకు తగిన గుర్తింపు ఇవ్వాలి. అవినీతిని ప్రశ్నించడం అంటే ప్రభుత్వ ఉద్యోగులందరినీ అవమానించడం కాదు. అవినీతికి పాల్పడే వ్యక్తులను ప్రశ్నించడం, ప్రజాధనాన్ని కాపాడటం, పరిపాలనను జవాబుదారీగా మార్చడం ప్రతి పౌరుడి బాధ్యత.

యువత ఉద్యోగం సాధించాక ఏం చేయాలి?

నేటి యువత కేవలం ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా పెట్టుకోకూడదు. ఉద్యోగం సాధించిన తర్వాత సమాజానికి ఏం చేయగలమో కూడా ఆలోచించాలి. మీరు ఏ హోదాలో ఉన్నా, ఏ శాఖలో పనిచేస్తున్నా మీ దగ్గరకు వచ్చే వ్యక్తి ఒక మనిషి. అతనికి కూడా కుటుంబం ఉంటుంది, సమస్యలు ఉంటాయి, ఆశలు ఉంటాయి. అతని అవసరాన్ని మీ అక్రమ సంపాదనకు అవకాశం గా చూడకండి. మీరు చేసే చిన్న సహాయం ఒక పేద కుటుంబా నికి పెద్ద ఉపశమనంగా మారవచ్చు. మీరు నిజాయితీగా పరిష్కరించే ఒక సమస్య ఒక కుటుంబానికి న్యాయం చేయవచ్చు. అందుకే ఉద్యోగం అంటే కేవలం జీతం కాదు.. అది సమాజం మీకు అప్పగించిన బాధ్యత.

ప్రశ్నించాల్సిన సమయం వచ్చింది!

మన సమాజం ఇప్పుడు ఒక కీలకమైన ప్రశ్నను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ ఉద్యోగం అంటే ప్రజలకు సేవ చేసే అవకాశం అని భావించాలా? లేక కొంతమంది దానిని అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకుంటున్నారని బాధపడాలా? తల్లిదండ్రుల కష్టంతో చదువుకొని, ప్రజల పన్నులతో జీతం తీసుకుంటూ, అదే ప్రజల దగ్గర లంచాలు అడిగే పరిస్థితి మారాలి. ప్రజాస్వామ్యంలో ప్రజలు అధికారులకు భయపడే పరిస్థితి ఉండకూడదు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి. ప్రభుత్వ ఉద్యోగి ప్రజలకు యజమాని కాదు.. ప్రజలకు సేవకుడు. అధికారం అనేది దోపిడీకి లైసెన్స్ కాదు. అది ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించాల్సిన బాధ్యత. ఉద్యోగం సంపాదించడానికి రాత్రింబగళ్లు చదివారు.. మరి ప్రజలను దోచుకోవడానికి ఎందుకు రాత్రింబగళ్లు ఆలోచిస్తున్నారు? తల్లిదండ్రుల చెమటతో సాధించిన ఉద్యోగాన్ని ప్రజల కన్నీళ్లకు కారణం చేయకండి!

అవినీతి వల్ల నష్టపోతున్నది ఎవరు?

- లంచం ఇచ్చే వ్యక్తి ఒక్కరోజు నష్టపోతాడేమో కానీ అవినీతి వ్యవస్థ వల్ల నష్టపోయేది మొత్తం సమాజం.
- పేదవాడికి న్యాయంగా అందాల్సిన ప్రభుత్వ సేవ ఆలస్యమవుతుంది.
- రైతు తన హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది.
- నిరుద్యోగ యువతలో వ్యవస్థపై నమ్మకం తగ్గుతుంది.
- అర్హులైన వారికి అందాల్సిన పథకాలు పక్కదారి పడతాయి.
- నిజాయితీగా పనిచేసే ఉద్యోగుల గౌరవం దెబ్బతింటుంది.
- ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు ఉన్న విశ్వాసం క్రమంగా తగ్గుతుంది.
- అవినీతి అనేది కేవలం లంచం తీసుకునే వ్యక్తి చేసిన తప్పు మాత్రమే కాదు. అది ప్రజల హక్కులను, సమాన అవకాశాలను, సామాజిక న్యాయాన్ని దెబ్బతీసే తీవ్రమైన సమస్య.



జగదీష్ వేముల, సామాజిక కార్యకర్త

పీపుల్స్‌డైరీ
కరీంనగర్
బుధవారం, 4 నవంబర్ 2026
సంపుటి : 18, సంచిక : 222

తెలంగాణలో అధికారంపై బీజేపీవి పగటి కలలు

కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను ఖండించిన మంత్రి పొంగులేటి



ఖమ్మం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో బిజెపి పాగా వేస్తుందని కేంద్ర మంత్రి అమీత్ షా, ఆ పార్టీ పెద్దలు పగటి కలలు కంటున్నారని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి విమర్శించారు. మంగళవారం దమ్మాయిగూడెం గ్రామంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను 187 మందికి అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఎన్నికల సంఘాన్ని తొత్తుగా మార్చుకొని.. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరిట.. దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓట్లను తొలగించిందని, ఆ పార్టీని ఇక్కడి ప్రజలు నమ్మబోరని అన్నారు. తెలంగాణ నుంచి ఢిల్లీకి ఆర్ఆర్ టాక్స్ వెళ్తోందని కేంద్ర మంత్రి అమిత్ షా విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. గతంలో తొమ్మిదన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన అవినీతి, అక్రమాలపై ఆధారాలతో ఫిర్యాదు చేసినా కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని అన్నారు. బిజెపి, బీఆర్ఎస్ దొందూ దొందేనని విమర్శించారు. ఒకరు కొట్టినట్లు.. మరొకరు ఏడ్చినట్లు నటిస్తూ.. ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. ఓట్లు రక్షించాల్సిన కేంద్రం భక్షించిందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణలో మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని, దేశంలో రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని మంత్రి పొంగులేటి ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక.. దేశవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేసి, అర్హులైన పేదల సొంతింటి కలను సాకారం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి, ఆత్మ కమిటీ పాలేరు నియోజకవర్గ చైర్మన్ చావా శివరామకృష్ణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొప్పుల అశోక్, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



జూన్ నాటికి ఆసుపత్రిని సిద్ధం చేయాలి

రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఖమ్మం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : కూసుమంచి మండల కేంద్ర సమీపంలోని గంగ బండ తండా వద్ద రూ.45 కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని నిర్దిష్ట గడువు మేరకు జూన్ నెల నాటికి సిద్ధం చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్ ను ఆదేశించారు. కలెక్టర్ దివాకర.టిఎస్, ఆర్డీవో ఎన్.శ్రీనివాస్, ఇతర అధికారులతో కలిసి స్లాబ్ దశలో ఉన్న నిర్మాణ పనులను నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదవారికి అనారోగ్యం కలిగితే, వారు ఆర్థికంగా చితికి పోకుండా మెరుగైన వైద్య సేవలు అందించేలా ఈ వంద పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నామని అన్నారు. పూర్తిస్థాయిలో వైద్యులను, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలాగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు హఫీజుద్దీన్, జూకూరి గోపాలరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, వైద్య శాఖ ఈఈ టీ. ఉమామహేశ్వర రావు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, తదితరులున్నారు.

తెల్లారుపల్లి వద్ద ఎన్నెస్పీ కాల్వపై బ్రిడ్జి నిర్మిస్తాం

తెల్లారుపల్లి 14,15,16వ వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి





ఖమ్మం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి వద్ద స్థానిక రైతులు గ్రామానికి అవతల వైపు ఉన్న తమ వ్యవసాయ భూముల వద్దకు వెళ్లేందుకు, గ్రామస్తుల సౌకర్యార్థం రూ.5 కోట్ల నిధులతో ఎన్నెస్పి కాలువపై నూతన బ్రిడ్జిని నిర్మిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. మంగళవారం తెల్దారుపల్లి లోని 14,15,16వ వార్డుల్లో రూ. 3.20 కోట్లతో నిర్మించే సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం కలెక్టర్ దివాకర.టిఎస్, ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్ లతో కలిసి మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం వచ్చి న ఈ 33 నెలల్లో తెల్దారుపల్లి అభివృ ద్ధికి.. రూ. 16.06 కోట్లు కేటాయించి చినట్లు వెల్లడించారు. రూ.5.25 కోట్లతో 105 ఇందిరమ్మ ఇళ్లను పేదలకు ఇచ్చామని చెప్పారు.

అర్హులైన రైతులందరికీ 'భూధార్' కార్డులిస్తాం

రాష్ట్రంలో సుమారు 125 సంవత్సరాల క్రితం భూముల సర్వే జరిగిందని, మళ్లీ ఇప్పుడు తమ ప్రభుత్వం సర్వే చేపించి, రైతులకు పూర్తి భరోసా కల్పించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి అన్నారు. పాలేరు నియోజకవర్గం లోని అన్ని గ్రామాల్లోనూ ఈ సర్వేను వెంటనే చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథ బాబు, ఆర్డీవో శ్రీనివాస్, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు బానోత్ కిషోర్ నాయక్, పలువురు కౌన్సిలర్లు, నాయకులు, తదితరులున్నారు.

ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శం

ఖమ్మం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగ విరమణ చేసిన గడ్డికొప్పుల రాములు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాములు వారి కుటుంబ సభ్యులను మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... విద్యుత్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు, రైతులకు విశేష సేవలందించి రాములు ఉద్యోగ విరమణ పొందారన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడే విరమణ తేదీ ఖరారవుతుందని, అయితే, సర్వీసులో ఉన్నంత కాలం ప్రజలకు, రైతులకు మనం అందించిన సేవలే ఉద్యోగ విరమణ తర్వాత కూడా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. రాములు విద్యుత్ శాఖలో పనిచేసిన కాలంలో అందించిన సేవలు, చేసిన మంచి పనుల వల్లే ఈరోజు వర్షం పడుతున్నప్పటికీ వందలాది మంది రైతులు, ప్రజలు ఆత్మీయంగా



తరలివచ్చారన్నారు. ఉద్యోగి సేవా కాలం ముగిసిన తర్వాత కూడా ప్రజలు వారిని గుర్తుపెట్టుకోవడమే అసలైన విజయమని మంత్రి తెలిపారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులకైనా, ప్రభుత్వ ఉద్యోగులకైనా భగవంతుడు ప్రజలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశాన్ని ఇస్తాడని, ఆ అవకాశాన్ని సొంత లాభం కోసం కాకుండా, ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించినప్పుడే జన్మకు సార్థకత లభిస్తుందని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులున్నారు.



సంక్షేమ పథకాల అమలుకు తొలి ప్రాధాన్యత

లబ్ధిదారులకు కార్డులు అందజేసిన సర్పంచ్ తాటి వాణి

కృష్ణసాగర్, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరువ కావాలనే లక్ష్యంతో గ్రామస్థాయిలో పంపిణీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు గారి ఆదేశాల మేరకు బూర్గంపాడు మండలం కృష్ణసాగర్ గ్రామపంచాయతీ పరిధిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ తాటి వాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తాటి వాణి మాట్లాడుతూ.. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడం ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల సమాచారం చేరడంతో పాటు, వారికి అందాల్సిన ప్రయోజనాలు సక్రమంగా అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని ప్రజల అవసరాలను గుర్తిస్తూ, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించేందుకు స్థానిక పాలకవర్గం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భూక్య మోహన్ రావు, పంచాయతీ కార్యదర్శి ఎం. నాగిరెడ్డి, రేషన్ షాప్ సేల్స్‌మెన్ ధరావత్ రాంబాబు, పాలకవర్గ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, గ్రామస్తులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

నాగరత్నంకు సిపిఐ నేతల నివాళి



ఏన్కూర్, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మండల పరిధిలోని జన్నారం గ్రామానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు జాగర్లమూడి సత్యం సతీమణి జాగర్లమూడి నాగరత్నం మంగళవారం గుండెపోటుతో కన్నుమూశారు.ఈ సమాచారం మేరకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత్ రావు జన్నారం చేరుకుని నాగరత్నం భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎర్ర బాబు, ఏనుగు వెంకటేశ్వరావు, మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని నివాళులర్పించారు.

ఇంటింటికీ వెళ్లి పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన

మణుగూరు, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : త్వరలో జరగనున్న ఖమ్మం--వరంగల్--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ మణుగూరు మండలంలో కొనసాగుతోంది. ఈ క్రమంలో సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదును వేగవంతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా పట్టభద్రుల ఇళ్లకు నేరుగా వెళ్లి ఓటరు నమోదుకు అవసరమైన వివరాలను సేకరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు పిరునాకి నవీన్, సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ కలిసి గ్రామ పరిధిలోని పట్టభద్రుల ఇళ్లను సందర్శిస్తూ ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరిస్తూ, నమోదు



ప్రక్రియకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉపసర్పంచ్ గాండ్ల సురేష్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగి ఉండటం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అర్హత కలిగిన పట్టభద్రులు ఎవరూ ఓటరు నమోదుకు దూరంగా ఉండకూడదని, నవంబర్ 6, 2026లోపు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రతి అర్హులైన పట్టభద్రుడికి ఈ విషయం చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు పిరునాకి నవీన్ మాట్లాడుతూ ఖమ్మం--వరంగల్--నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతుగా పట్టభద్రులు నిలవాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలు, వారి ఆకాంక్షలు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంలో ఎమ్మెల్సీ ఎన్నికలు కీలకమైనవని పేర్కొంటూ, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ముందుగా తన ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా నాయకులు, ప్రజాప్రతినిధులను సంప్రదించి అవసరమైన సహకారం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలో పట్టభద్రుల ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తూ, అర్హులైన వారందరినీ నమోదు ప్రక్రియలో భాగస్వాములను చేసేందుకు నాయకులు కృషి చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి

చేపల మార్కెట్ ప్రాంతాన్ని సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి



మణుగూరు, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని చేపల మార్కెట్ ప్రాంతాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ సందర్శించి స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ప్రజల ఆరోగ్య పరిస్థితులు, పరిసరాల పరిశుభ్రత, తాగునీటి సరఫరా తదితర అంశాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్‌తో కలిసి ప్రాంతంలో పర్యటించి పారిశుధ్య పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలు తాగునీటి విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న నీటిని కాచి చల్లార్చిన అనంతరం తాగాలని తెలిపారు. పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం చేపట్టాలని, చెత్తాచెదారం పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో వ్యాధుల పట్ల ఉన్న అపోహలను తొలగించి, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరును సందర్శించిన డీఎంహెచ్ఓ ఆశా డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలతో నెలవారీ సమీక్ష నిర్వహించి, క్షేత్రస్థాయిలో చేపడుతున్న ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. విధులకు సంబంధించిన రికార్డులు, నివేదికలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రధానంగా క్షయవ్యాధి (టీబీ), కుష్ఠువ్యాధి (లెప్రసీ)తో పాటు అసంక్రమిత వ్యాధులైన మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్‌పై ఆశా కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఆయా వ్యాధుల లక్షణాలు, ముందస్తు గుర్తింపు, పరీక్షలు, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వ్యాధుల నియంత్రణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎంఓ మోహన్, సీహెచ్ఓ వీరాస్వామి, ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ

కరకగూడెం, నవంబర్ 3 (పీపుల్స్ డైరీ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (గ్రానజ) జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డీఎంహెచ్ఓ డాక్టర్ తుకారాం రాథోడ్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్సీలో అందుతున్న వైద్య సేవలను క్షుణ్ణంగా పరిశీలించి పలు సలహాలు, సూచనలు చేశారు. పీహెచ్సీకి వచ్చే రోగుల సంఖ్య, ఓపీ సేవలు, ప్రసవాల తీరు, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణ, పారిశుధ్యం తదితర అంశాలపై ఆరా తీశారు. పీహెచ్సీ పరిసరాలను, వార్డులను కూడా పరిశీలించి నిర్వహణ బాగుండాలని ఆదేశించారు. నర్సింగ్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు, వాటి నివారణ చర్యలు పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ తో పాటు డాక్టర్ రవి తేజ పిఏంఓ , సూపర్వైజర్లు, హెచ్ఈఓ శ్రీ పాల్వాయి రమేష్, ఫార్మసిస్ట్ సతీష్, ల్యాబ్ టెక్నీషియన్, సెక్రటరీలు, ఆశా కార్యకర్తలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **KONDAPARTHI KIRAN,** PRINTED AT RATNA GRAPHICS, 2-3-703/7, THIRUMALA NAGAR COLONY, OPP : POLICE LINE, AMBERPET, HYDERABAD, TELANGANA - 500013, PUBLISHED AT H.NO. 3-4-396, NEW RAYAPURA, HANAMKONDA, WARANGAL, TELANGANA - 506001.
EDITOR : KONDAPARTHI KIRAN.RNI NO: TEL/TEL/2009/28544, CELL:9493019044, e-mail : peoplesdairydaily@gmail.com